News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

CK NEWS చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :287 | ఖమ్మం | శుక్రవారం నవంబర్ 28, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# కేసీఆర్ ఉన్నంత వరకే బీఆర్ఎస్

## ఆ తర్వాత పార్టీ మూడు ముక్కలు




- కేటీఆర్ ఐరన్ లెగ్.. ఆయనపై కార్యకర్తలకు నమ్మకం లేదు
- కవిత తన దారి తాను చూసుకున్నరు
- హరీశ్ కూడా టైం కోసం చూస్తుండు
- పదేండ్లలో 36 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ లో చేర్చుకుండ్రు
- ఫిరాయింపులు తప్పని నీకు అప్పుడు తెలువదా కేటీఆర్..?
- నీ అవినీతి చరిత్ర అందరికీ తెలుసు..
- అహంకారం, బలుపు తగ్గించుకో
- ముందుగా కవిత విమర్శలకు జవాబు చెప్పు
- కేటీఆర్ పై మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ఫైర్

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్?పై స్టేషన్ ఘన్?పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫైర్ అయ్యారు. వరంగల్ పర్యటన సందర్భంగా కేటీఆర్ తనపై చేసిన వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కడియం శ్రీహరి దమ్ము ఉన్న నాయకుడని.. కేటీఆర్ మాదిరిగా అయ్య అండ చూసుకొని రాజకీయాలు చేయట్లేదని విమర్శించారు. కేసీఆర్ లేకపోతే నిన్ను అడిగేవారెవరు..? కేసీఆర్ లేకపోతే నీ ఐడెంటిటీ ఎక్కడిది..? కేటీఆర్?ను ప్రశ్నించారు.
కడియం శ్రీహరికి కుటుంబ రాజకీయాలు లేవని.. స్వతహగా ఎదిగొచ్చిన నాయకుడని అన్నారు. విలువలు, నీతి గురించి నువ్వు మాట్లాడుతున్నావా.. గత పదేళ్లలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను మీ పార్టీలో చేర్చుకొని మంత్రి పదవులు ఇచ్చినప్పుడు ఏమైపోయినవి ఈ విలువలు అని ప్రశ్నించారు. ఆ రోజు ఏం పీకుతున్నవ్.. కేసీఆర్ తప్పు అని అప్పుడు ఎందుకు చెప్పలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు నీకు లేదన్నారు.
కేటీఆర్ నాయకత్వంపై సందేహాలున్నాయని.. అతడి దగ్గర పని చేయలేకనే కవిత బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లిందన్నారు. కేటీఆర్ అంటేనే ఐరన్ లెగ్ అని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అతడి నాయకత్వంలో పని చేయలేకపోతున్నారని ఆరోపించారు. కేసీఆర్ కోసమే హరీష్ రావు బీఆర్ఎస్ పార్టీలో ఉన్నాడని.. సమయం చూసి హరీష్ రావు కూడా ఆయన దారి ఆయన చూసుకుంటాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీకి కేటీఆర్ నాయకత్వం పనికి రాదని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు తెలుసన్నారు. ఇకనైనా అహంకారం, బలుపుతో మాట్లాడటం మానేయాలని హితవు పలికారు. పెద్ద నాయకునివి కావాలంటే బలుపు, అహంకారం తగ్గించుకోవాలని సూచించారు.

---

ఐ-బొమ్మ కేసులో కీలక మలుపు..

## నిర్వాహకుడు రవి మళ్లీ కస్టడీకి!




- ఐ-బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి మరోసారి పోలీసుల కస్టడీకి
- మూడు రోజుల పాటు విచారించనున్న సైబర్ క్రైమ్ పోలీసులు
- బ్యాంకు ఖాతాలు, నెట్‌వర్క్‌పై మరింత సమాచారం రాబట్టడమే లక్ష్యం
- ఇటీవల ఐదు రోజుల పాటు విచారించిన అధికారులు

పైరసీ వెబ్‌సైట్ 'ఐ-బొమ్మ' కేసులో ప్రధాన నిందితుడైన ఇమంది రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మరోసారి కస్టడీలోకి తీసుకున్నారు. ఇవాళ్టి నుంచి మూడు రోజుల పాటు అతడిని విచారించనున్నారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు, ముఖ్యంగా అతడి బ్యాంకు ఖాతాలు, నెట్‌వర్క్‌కు సంబంధించిన

వివరాలు 2లో..

---

## తెలంగాణ 'గ్రూప్ 2'పై సింగిల్ బెంచ్ తీర్పును సస్పెండ్ చేసిన హైకోర్టు




- 2015 గ్రూప్ 2 ర్యాంకర్లకు ఊరట
- ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేసిన సింగిల్ బెంచ్
- తాజాగా సీజే ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు


తెలంగాణ గ్రూప్ 2 (2015) వివాదంపై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు సస్పెండ్ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) నేతృత్వంలోని ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పుతో గ్రూప్ 2 ర్యాంకర్లకు ఊరట లభించింది. 2015-16 లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే.దీనిపై పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. వైట్ నర్, దిద్దుబాటు ఉన్న జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారని టీజీపీఎస్సీపై ఆరోపణలు చేశారు. ఈ కేసును విచారించిన హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం..

వివరాలు 2లో..

---

## బంగాళాఖాతంలో 'దిట్వా' తుపాను...

- శనివారం నాటికి దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరంపై ప్రభావం చూపే సూచన
- తమిళనాడులో భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక
- ప్రధాన పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలు జారీ.. మత్స్యకారులు అప్రమత్తం



నైరుతి బంగాళాఖాతం లో, శ్రీలంక తీరానికి సమీపంలో ఏర్పడిన వాతా వరణ వ్యవస్థ గురువారం తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఇది గురువారం సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

వివరాలు 2లో..

---

## వాళ్లకి ఆధార్ కార్డు ఉంటే ఇక ఓటు హక్కు ఇచ్చినట్టేనా?

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



- చొరబాటుదారులకు ఆధార్ కార్డులు జారీ కావడంపై సుప్రీంకోర్టు ఆందోళన
- ఆధార్ ఉన్నంత మాత్రాన ఓటు హక్కు ఇవ్వాలా? అని కీలక ప్రశ్న
- పౌరసత్వానికి ఆధార్ కార్డు రుజువు కాదని మరోసారి స్పష్టీకరణ
- ఓటర్ల జాబితా సవరణపై ఈసీకి డిసెంబర్ 1 వరకు గడువు

వివరాలు 2లో..

---

## టెక్ భారత్ సాకారం



- జెన్-జడ్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు
- అంతరిక్ష రంగం విస్తరణకు అంకుర సంస్థల అండ
- ప్రపంచంలో మనది మూడో అతిపెద్ద స్టార్టప్‌ల వ్యవస్థ
- హైదరాబాద్‌లో 'స్కైరూట్' ఇన్ఫినిటీ క్యాంపస్ వర్చువల్‌గా ప్రారంభం

వివరాలు 2లో..



యువతను శాస్త్ర ప్రయోగాల వైపు మళ్లించే లక్ష్యంతో 'నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్'ను స్థాపించాం. పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాలకు రూ.1 లక్ష కోట్లతో నిధి ఏర్పాటు చేశాం. ఇప్పటికే 10,000 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ప్రారంభించాం. త్వరలో మరో 50,000 ల్యాబ్‌లు నెలకొల్పుతాం.

---



## చైనా, జపాన్‌తో పోటీ పడదాం..

అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ అభివృద్ధి: సీఎం రేవంత్ రెడ్డి

- ప్రపంచంతో పోటీపడేలా నైపుణ్య యువత
- మూడు రీజియన్లుగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి
- ప్రగతిని ప్రతిబింబించేలా 'తెలంగాణ రైజింగ్-2047 పాలసీ'
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- సమీక్షలో మాట్లాడుతున్న సీఎం

చైనా, జపాన్‌ల స్థాయికి చేరడమే లక్ష్యంగా.. రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా 'తెలంగాణ రైజింగ్-2047 పాలసీ' డాక్యుమెంట్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్ర యువతలో


వివరాలు 2లో..

---

## ఆరుగురు జనాభాకే సర్పంచి.. 3 వార్డులు కేటాయిస్తారా?

మహమూద్‌పట్నం పంచాయతీ ఎన్నికల నిలిపివేత

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



వరంగల్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్‌పట్నం గ్రామంలో కేవలం ఆరుగురు ఎస్టీ జనాభా ఉంటే.. వారికి సర్పంచి పోస్టుతో పాటు మూడు వార్డులను కేటాయిం చడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. 2025 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకోకుండా

వివరాలు 2లో..

---

## ఫోన్ ట్యాపింగ్ కేసు... కేసీఆర్ ఓఎస్‌డీని విచారించిన సిట్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో వేగం పెంచిన సిట్ అధికారులు
- మాజీ ఓఎస్‌డీ రాజశేఖర్ రెడ్డిని విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం
- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో రెండు గంటల పాటు కొనసాగిన విచారణ
- కొత్త సీపీ సజ్జనార్ ఆదేశాలతో దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు
- కీలక నిందితుడి రిమాండ్ రిపోర్టు ఆధారంగా మరికొందరిని ప్రశ్నించే అవకాశం



వివరాలు 2లో..

# వాళ్లకి ఆధార్ కార్డు ఉంటే ఇక ఓటు హక్కు ఇచ్చినట్టేనా?

దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వారికి కూడా ఆధార్ కార్డులు అందుతున్నాయని, అలాంటప్పుడు ఆధార్ కార్డు ఉన్నంత మాత్రాన వారికి ఓటు హక్కు కూడా కల్పించాలా? అని సుప్రీంకోర్టు కీలక ప్రశ్న లేవనెత్తింది. ఆధార్ కార్డు కేవలం సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేరవేయడానికి మాత్రమేనని, దానిని పౌరసత్వానికి లేదా ఓటు హక్కుకు రుజువుగా పరిగణించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను (%హా×=%) సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. "పొరుగు దేశం నుంచి వచ్చిన ఓ కూలీకి రేషన్ కోసం
ఆధార్ కార్డు ఇస్తే, అతడిని ఓటరుగా కూడా చేయాలా?" అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. ఎన్నికల సంఘం కేవలం పోస్టాఫీసు కాదని, ఓటరు దరఖాస్తుతో పాటు సమర్పించిన పత్రాల వాస్తవికతను పరిశీలించే అధికారం దానికి ఉందని స్పష్టం చేసింది.పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. ఈసీ చేపట్టిన ప్రక్రియ నిరక్షరాస్యులైన సాధారణ ఓటర్లపై రాజ్యాంగ విరుద్ధమైన భారం మోపుతోందని అన్నారు. ఫారాలు నింపడం తెలియని వారిని జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధార్ పౌరసత్వానికి తిరుగులేని రుజువు కాకపోయినా, నివాసానికి సంబంధించి ప్రాథమిక ఆధారంగా పరిగణించాలని వాదించారు.తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు సంబంధించిన పిటిషన్లపై డిసెంబర్ 1లోగా సమాధానం దాఖలు చేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

# టెక్ భారత్ సాకారం

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ భారతదేశాన్ని అగ్రపథంలో నిలుపుతున్నారని, 'టెక్ భారత్'ను సాకారం చేస్తున్నారని యువతరంపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా జెన్-జడ్ ఇంజినీర్లు, డిజైనర్లు, కోడర్లు, శాస్త్రవేత్తలు సరికొత్త అవకాశాలను సృష్టిస్తూ అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని విస్తరిస్తున్నారని అభినందించారు. అంతరిక్ష సేవల ప్రైవేటు సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను గురువారం ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ఉపగ్రహ ప్రయోగాల కోసం విక్రమ్-1 అనే ఆర్బిటల్ రాకెట్‌ను ఈ సంస్థ రూపొందించింది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "చిన్నపాటి అద్దె గదుల్లో, పరిమితమైన వనరులతో ప్రారంభమైన అంతరిక్ష సేవల రంగానికి చెందిన 300 అంకుర సంస్థలు ఇప్పుడు అత్యంత క్రియాశీలకంగా మారాయి. జెన్-జడ్‌లో సృజనాత్మకత, ఆశావాదం, దృఢచిత్తం ఎక్కువగా కనిపిస్తున్నాయి. దాదాపు 1.50 లక్షల
స్టార్టప్‌లతో ప్రపంచవ్యాప్తంగా మూడో అతిపెద్ద అంకుర సంస్థల వ్యవస్థ మనదే. మనదేశం ఇప్పుడు యాప్స్, సేవలకు మాత్రమే పరిమితం కాలేదు. డీప్-టెక్, హార్డ్‌వేర్, ఉత్పత్తి రంగాల్లో వేగంగా వృద్ధి చెందుతోంది.

**అంతరిక్షం ఇప్పుడు వ్యూహాత్మక ఆస్తి**

రాకెట్ విడిభాగాలను సైకిల్‌పై తీసుకెళ్లిన రోజుల నుంచి ఎంతో విశ్వసనీయమైన ప్రయోగ వాహకాన్ని (లాంచ్ వెహికల్) రూపొందించిన ఘనత సాధించాం. అంతరిక్ష సేవల రంగంలో ప్రైవేటు రంగానికి భాగస్వామ్యం కల్పించాం. అంకుర సంస్థలు ఇస్రో సదుపాయాలను, సాంకేతికతను వినియోగించుకునే అవకాశం కల్పించాం. కేవలం 6-7 ఏళ్లలోనే బహుముఖంగా విస్తరించిన మన అంతరిక్ష రంగం ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. చిన్న ఉపగ్రహాలకు గిరాకీ పెరుగుతోంది. దీనివల్ల ఎన్నో దేశాలు మనవైపు చూస్తున్నాయి. ఉపగ్రహ ప్రయోగాలూ పెరుగుతున్నాయి. అంతరిక్షం ఇప్పుడు వ్యూహాత్మక ఆస్తి. వచ్చే కొద్ది రోజుల్లోనే ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ ఎన్నో రెట్లు పెరుగుతుంది. ఇది మన యువతకు గొప్ప అవకాశం. భారత అంతరిక్ష రంగ స్టార్టప్‌ల నుంచి త్వరలో ఐదు యూనికార్న్‌లు వస్తాయనే నమ్మకముంది.

**అణు విద్యుత్‌లోనూ సంస్కరణలు**

అంతరిక్ష సేవల్లో ప్రైవేటు రంగానికి తలుపులు తెరచినట్లుగానే అణు విద్యుత్తు రంగంలోనూ అవకాశం కల్పించనున్నాం. దీనివల్ల స్మాల్ మాడ్యులార్ రియాక్టర్లు, అడ్వాన్స్‌డ్ రియాక్టర్ల ఉత్పత్తి, అణు సాంకేతిక పరిజ్ఞానం విస్తృతికి వీలుకలుగుతుంది. ఇంధన భద్రత లభిస్తుంది. సెమీకండక్టర్ రంగంలోనూ ఇదేవిధంగా విస్తరిస్తున్నాం" అని వెల్లడించారు.

# ఆరుగురు జనాభాకే సర్పంచి.. 3 వార్డులు కేటాయిస్తారా?

- మొదటి పేజి తరువాయి

2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్‌లు కేటాయించడం సరికాదంది. దీనిపై సమర్పించిన వినతిపత్రాలపై నిర్ణయం తీసుకునేదాకా మహమూద్‌పట్నం పంచాయతీ ఎన్నికలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. మహమూద్‌పట్నం సర్పంచి పోస్టును ఎస్టీ మహిళకు కేటాయించడాన్ని సవాలు చేస్తూ మిట్టగడుపుల యాకూబ్ హైకోర్టులో అత్యవసరంగా లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి.మాధవీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది రమేశ్ చిల్లా వాదనలు వినిపిస్తూ గ్రామంలో 2025 ఓటర్ల జాబితా ప్రకారం 576 మంది ఓటర్లున్నారన్నారు. అందులో ఎస్టీలు ఆరుగురేనన్నారు. వీరికి సర్పంచి పోస్టుతో పాటు 3 వార్డులను రిజర్వు చేశారన్నారు. 250 మంది ఎస్సీలు, 300 మంది బీసీలు,
20 మందికి పైగా ఓసీలున్నారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కేటాయిస్తూ ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎస్సీ జనరల్ మహిళకు కేటాయించిన అధికారులు ఇప్పుడు ఎస్టీలకు కేటాయించారన్నారు.
దీనిపై ఇచ్చిన వినతిపత్రాలపై చర్యలు తీసుకోలేదన్నారు. వినతి పత్రాలపై చర్యలు తీసుకునేదాకా.. మహమూద్‌పట్నం పంచాయతీ ఎన్నికను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తూ విచారణను డిసెంబరు 29కి వాయిదా వేశారు. వీటితోపాటు రిజర్వేషన్‌లను సవాలు చేస్తూ పలు పిటిషన్‌లపై విచారించిన న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. బీసీ రిజర్వేషన్‌లకు సంబంధించి వివాదం ప్రధాన న్యాయమూర్తి బెంచ్‌లో పెండింగ్‌లో ఉన్నందున ఉత్తర్వులివ్వడంలేదన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ బీసీలకు 23 శాతం
కూడా కేటాయించలేదన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు కేటాయించిన అనంతరం బీసీలకు రిజర్వేషన్‌లు ఉంటాయన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగపరంగా రిజర్వేషన్‌లు లభించాయని, వారి తరువాతే ఇతరులకు రిజర్వేషన్‌లు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఈ పిటిషన్‌లలో ఎంతవరకు జోక్యం చేసుకోవాలో శుక్రవారం పరిశీలిస్తామన్నారు.

# చైనా, జపాన్‌తో పోటీ పడదాం..

- మొదటి పేజి తరువాయి

నైపుణ్యాలను తీర్చిదిద్దాలన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు స్పష్టమైన మార్గసూచీ పాలసీ డాక్యుమెంట్‌లో కనిపించాలని నిర్దేశించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ.. ఇలా మూడు రీజియన్లుగా విభజించుకోవాలని సూచించారు. 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్'లో గురువారం 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2025'పై సీఎం సమీక్షించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అజారుద్దీన్, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఉన్నతాధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు పాలసీ డాక్యుమెంట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "తెలంగాణలో ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచ పెట్టుబడిదారుల ముందు ఉంచడంతోపాటు ఇక్కడ పెట్టుబడులు పెట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను సదస్సు జరిగే రెండు రోజుల్లో ప్రదర్శించడమే లక్ష్యం. విభిన్న రంగాల్లో పారిశ్రామిక అభివృద్ధికి గల అవకాశాలను వివరించడంతోపాటు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను ప్రకటించాలి. 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' డాక్యుమెంట్.. రాష్ట్ర భవిష్యత్తుకు సమగ్ర మార్గరూపం. మహిళా సాధికారత, యువశక్తి, స్థిరమైన అభివృద్ధి.. ఈ మూడు ప్రధాన రంగాలపై రాష్ట్ర అభివృద్ధి వ్యూహాన్ని ప్రభుత్వం సిద్ధం చేసింది. తెలంగాణను దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దడం ఈ డాక్యుమెంట్ లక్ష్యం. ఇక్కడ ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పాలని ప్రజాప్రభుత్వం సంకల్పించింది. అభివృద్ధిలో పక్క రాష్ట్రాలతో కాదు చైనా, జపాన్‌లతో పోటీ పడే లక్ష్యంతో ముందుకుపోతోంది.

**బలాలే పునాదిగా**

ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధ, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, టూరిజం, ఎగుమతులు వంటి రంగాలు.. రానున్న రెండు దశాబ్దాల్లో ఆర్థిక వృద్ధికి కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. పారదర్శక పాలన, సులభ అనుమతులు, జీసీసీలు రాష్ట్రాన్ని పెట్టుబడిదారుల మొదటి గమ్యస్థానంగా నిలబెట్టనున్నాయి. ఈ బలాలే పునాదిగా మరింతగా పెట్టుబడులను ఆకర్షించే విధంగా విజన్ డాక్యుమెంట్ ఉండబోతోంది. హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ తెలంగాణ.. ఇలా మూడు జోన్లుగా అభివృద్ధి సమతౌల్యత సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేలా వ్యవసాయ కార్యాచరణ కూడా విజన్ డాక్యుమెంట్‌లో భాగమవుతోంది. మహిళా సాధికారతలో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. కాలుష్యం వల్ల కలిగే నష్టాలపై కూడా ఈ విజన్ డాక్యుమెంట్ ఫోకస్ చేస్తోంది. అందుకే నెట్-జీరో తెలంగాణను అవిష్కరించనుంది.

**ఆధునిక మౌలిక వసతుల కల్పన**

'బ్లూ-గ్రీన్' హైదరాబాద్ లక్ష్యంగా 'తెలంగాణ 2047 డాక్యుమెంట్'లో మూసీ పునరుజ్జీవం.. అందులో భాగంగా 2,959 చెరువులు, పార్కులు, అటవీ ప్రాంతాలను పూర్వ స్థితికి తీసుకురావడమే ధ్యేయం. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన రోడ్లు, సౌర విద్యుత్ వెలుగులతో 'విలేజ్ 2.0' లక్ష్యంతో ప్రభుత్వం పనిచేయనుంది. తెలంగాణకు మణిహారంలా రీజినల్ రింగ్ రోడ్డును ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. హై-స్పీడ్ మొబిలిటీ కారిడార్లను నిర్మించనుంది. రీజినల్ రింగ్ రైల్, 4 ఇండస్ట్రియల్ కారిడార్లు, 11 రేడియల్ రోడ్లను నిర్మించనుంది. వరంగల్, నిజామాబాద్, అదిలాబాద్, పెద్దపల్లి, కొత్తగూడెంలలో విమానాశ్రయాలను ఏర్పాటుచేయబోతోంది. హైదరాబాద్ నుంచి బందరు పోర్టు వరకు అత్యాధునిక హైవేను నిర్మించి సీపోర్టుకు అనుసంధానం చేయబోతోంది. 'గ్లోబల్ వర్క్ ఫోర్స్'తో పోటీపడేలా.. ప్రతి ఏడాది రెండు లక్షల మంది యువతకు, లక్ష మంది నిపుణులకు నైపుణ్య వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తోంది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాలుగా స్పోర్ట్స్ విలేజీలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. యువత సమతుల్య అభివృద్ధి కోసం హోలిస్టిక్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించటమే లక్ష్యంగా వివిధ ప్రాంతాల అభివృద్ధి, నైట్ ఎకానమీ సిటీగా హైదరాబాద్ ఇమేజ్‌ను క్రియేట్ చేయడం, బతుకమ్మ, బోనాల లాంటి పండగలతో బ్రాండ్ తెలంగాణను విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పించాం. ప్రపంచ సినిమా రంగాన్ని ఆకర్షిస్తూ యానిమేషన్, గేమింగ్, ఫిలిం-టెక్ పరిశ్రమలకు తెలంగాణ కొత్త గమ్యంగా రూపొందే లక్ష్యంతో పనిచేస్తాం. రాష్ట్రంలోని ప్రతి గ్రామంతోపాటు గ్లోబల్ సిటీ హైదరాబాద్ దాకా సమాన అవకాశాలు, స్థిరమైన అభివృద్ధి అనే లక్ష్యంతో విజన్ డాక్యుమెంట్-2047 మార్గదర్శకంగా ఉండబోతోంది" అని పేర్కొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు... కేసీఆర్ ఓఎస్‌డీని విచారించిన సిట్

- మొదటి పేజి తరువాయి

తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు మళ్లీ వేగం పుంజుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత సహాయకుడిగా (ఓఎస్‌డీ) పనిచేసిన రాజశేఖర్ రెడ్డిని ప్రశ్నించింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ విచారణలో అధికారులు కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది.హైదరాబాద్ నూతన పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన రాజశేఖర్ రెడ్డిని సిట్ విచారణకు పిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.
త బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. ఈ కేసులో ఇప్పటికే పలువురు పోలీసు అధికారులను సస్పెండ్ చేయగా, కీలక నిందితుడిగా ఉన్న మాజీ అధికారి రాధాకిషన్ రావును అరెస్టు చేశారు. 'బీఆర్‌ఎస్ సుప్రీం' ఆదేశాల మేరకే తాము పనిచేశామని రాధాకిషన్ రావు తన రిమాండ్ రిపోర్టులో పేర్కొనడం సంచలనం రేపింది. ఈ క్రమంలోనే కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన రాజశేఖర్ రెడ్డిని విచారించడం ద్వారా మరిన్ని వివరాలు రాబట్టాలని సిట్ భావిస్తోంది.
రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన సమాచారం ఆధారంగా ఈ కేసులో మరికొందరు కీలక వ్యక్తులను కూడా సిట్ విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ దర్యాప్తు ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు దారితీస్తాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## బంగాళాఖాతంలో 'దిట్వా' తుపాను...

- మొదటి పేజి తరువాయి

ఈ తుపానుకు 'దిట్వా' అని నామకరణం చేశారు. ప్రపంచ వాతావరణ సంస్థ (%ఔమీ%) సభ్య దేశాల జాబితా ప్రకారం యెమెన్ దేశం ఈ పేరును సూచించింది. యెమెన్‌కు చెందిన సోకోత్రా ద్వీపంలో 'దిట్వా లగూన్' అనే పేరుతో ఒక చాలా ప్రసిద్ధమైన, అందమైన ఉప్పునీటి సరస్సు ఉంది. ఇప్పుడు ఆ ప్రదేశం పేరునే, బంగాళాఖాతంలో ఏర్పడే తుపానుకు పెట్టారు. ప్రస్తుతం సముద్రంలో కేంద్రీకృతమై ఉన్న ఈ వ్యవస్థ మరింత బలపడి తీరం వైపు కదులుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.ఈ తుపాను వాయవ్య దిశగా కదులుతూ శ్రీలంక తీరప్రాంతాన్ని దాటి, శనివారం నాటికి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరితో పాటు దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం వైపునకు చేరుకుంటుందని భారత వాతావరణ విభాగం (%×వీణ%) అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరప్రాంత ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాను కదలికలను నిరంతరం గమనిస్తూ, ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేసేందుకు ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ సన్నద్ధమైంది.చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం (%=వీజ%) అంచనాల ప్రకారం, గురువారం దక్షిణ తమిళనాడు, డెల్టా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తీవ్రత మరింత పెరగనుంది. ముఖ్యంగా డెల్టా, దాని పరిసర జిల్లాల్లో శుక్రవారం నాడు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శనివారం నాటికి ఈ వాతావరణ వ్యవస్థ తీరం వెంబడి ఉత్తరం వైపు కదులుతున్న కొద్దీ, ఉత్తర తమిళనాడు జిల్లాల్లోనూ భారీ వర్షాలు నమోదవుతాయని అధికారులు వివరించారు.ఇదిలా ఉండగా, ఈశాన్య ఇండోనేషియా, మలక్కా జలసంధిపై కేంద్రీకృతమైన 'సెన్యార్' అనే మరో తుపాను తూర్పు వైపుగా కదులుతోంది. అయితే ఈ తుపాను వల్ల తమిళనాడుకు గానీ, భారత తీరానికి గానీ ఎలాంటి ముప్పు లేదని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

## తెలంగాణ 'గ్రూప్ 2'పై సింగిల్ బెంచ్ తీర్పును సస్పెండ్ చేసిన హైకోర్టు

- మొదటి పేజి తరువాయి

గ్రూప్ 2 లో ఎంపికైన వారి జాబితాను రద్దు చేసింది. ఈ తీర్పుపై టీజీపీఎస్సీ మరోమారు హైకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారించి తాజాగా సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసింది.

## ఐ-బొమ్మ కేసులో కీలక మలుపు.. నిర్వాహకుడు రవి మళ్లీ కస్టడీకి!

- మొదటి పేజి తరువాయి

పూర్తి సమాచారం రాబట్టేందుకు పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు.
ఇటీవల ఐ-బొమ్మ కేసులో రవిని అరెస్టు చేసిన పోలీసులు, కోర్టు అనుమతితో ఐదు రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారించారు. ఆ సమయంలో కొన్ని కీలక ఆధారాలను సేకరించినప్పటికీ, అతడి ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పూర్తి వివరాలు లభ్యం కాలేదని పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మరోసారి కస్టడీకి అనుమతించాలంటూ కోర్టును ఆశ్రయించారు.పోలీసుల అభ్యర్థనను పరిశీలించిన న్యాయస్థానం, మూడు రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. దీంతో చంచల్‌గూడ జైలులో ఉన్న రవిని సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విచారణలో అతడి నెట్‌వర్క్ ఎంతవరకు విస్తరించి ఉంది, ఆర్థిక మూలాలపై పోలీసులు దృష్టి సారించనున్నారు.

## టూరిస్టులకు టోకరా వేస్తున్న తండ్రీకూతురు!

దేశ రాజధాని ఢిల్లీలో భారీ ట్రావెల్ మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. తండ్రీకూతుళ్లు కలిసి ఏళ్లుగా పర్యాటకులను, ట్రావెల్ ఏజెంట్లను మోసం చేస్తున్న వ్యవహారం బట్టబయలైంది. చౌక ధరలకే విమాన టికెట్లు, హోటల్ వోచర్లు ఇస్తామని నమ్మించి, వారి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.నిందితులను సందీప్ చౌదరి, ఆయన కుమార్తె మల్లికా చౌదరిగా గుర్తించారు. వీరు నకిలీ హాలిడే ప్యాకేజీలు, ఫేక్ బుకింగ్స్ సృష్టించి అనేక మందిని మోసగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరిపై నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో చీటింగ్ కింద ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. నవంబర్ 13న న్యూ ఫ్రెండ్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదు ప్రకారం, సింగపూర్ టూర్ పేరుతో ఓ బాధితుడి నుంచి నిందితులు రూ.8 లక్షలు వసూలు చేశారు. డబ్బు తీసుకున్న తర్వాత ట్రిప్ రద్దు చేసుకోమని చెప్పి, తిరిగి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారు.గురుగ్రామ్‌కు చెందిన వ్యాపారి ఆశిష్ జైన్ కూడా వీరి చేతిలో రూ.70 లక్షలు మోసపోయారు. తనను మల్లికా చౌదరి సంప్రదించి, వ్యాపారంలో మంచి అవకాశాలు ఉన్నాయని నమ్మించిందని ఆశిష్ తెలిపారు. "ఆమె మాటలు నమ్మి భారీగా ఎయిర్ టికెట్లు బుక్ చేశాను. నా క్రెడిట్ లైన్స్ ఉపయోగించి బుకింగ్స్ పూర్తి చేశాక, డబ్బులు మాత్రం రాలేదు. అడిగితే ఇద్దరూ ఫోన్లు ఎత్తడం మానేసి, నన్ను బ్లాక్ చేశారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆనంద్ విహార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.ఇదే తరహాలో, స్విట్జర్లాండ్ వెకేషన్ కోసం ఇద్దరు సోదరుల నుంచి నిందితులు దాదాపు రూ.12 లక్షలు వసూలు చేశారు. బాధితుడు ధ్రువ్ గోయల్ కథనం ప్రకారం... డిస్కౌంట్ ఆఫర్ చేయడంతో టికెట్లు, హోటల్స్ బుక్ చేసుకున్నారు. అయితే, తీరా చూస్తే ఎలాంటి బుకింగ్స్ జరగలేదని, డబ్బులు కూడా తిరిగి రాలేదని తెలియడంతో పోలీసులను ఆశ్రయించారు.

## మీడియా సెంటర్ ను ప్రారంభించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి




**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, నవంబర్-28:**స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ మొదటి అంతస్తులోని ఎఫ్ 3 లో ఉన్న డిపిఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ను, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎం.సీ.ఎం.సీ)ను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి గురువారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.


జిల్లాలో ఎన్నికల సజావు నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరపున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు, ఎన్నికలు సక్రమంగా నిర్వహించడంలో పాత్రికేయులు తమ వంతు పాత్ర పోషించాలని, ఎతికల్ ఓటింగ్, ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించాలని, ఎన్నికలకు సంబంధించి సరైన సమాచారం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మీడియా సెంటర్ ద్వారా పాత్రికేయులకు అవసరమైన సరైన సమాచారం సకాలంలో అందించడం జరుగుతుందని, ఎన్నికల సందర్భంగా ఎటువంటి ఊహాగానాలకు చెందిన వార్తలను వెరిఫై చేసుకోకుండా రాయవద్దని అదనపు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల ప్రచారంలో వీడియోలు వినియోగించాలంటే ముందుగా మీడియా సెంటర్ లోని ఎంసిఎంసీ కమిటీని సంప్రదించి అనుమతి తీసుకోవాలని అన్నారు.

ఈ సమావేశంలో డిపిఆర్ఓ ఎం.ఏ. గౌస్, డిపిఓ ఆశాలత, అదనపు పిఆర్వో ఎండి. అయూబ్ ఖాన్, ఎంసిఎంసి కమిటీ సభ్యులు, కార్యాలయ టైపిస్ట్ ప్రవళిక, కంప్యూటర్ ఆపరేటర్లు నవీన్, హరీష్, సిబ్బంది చింతల శ్రీనివాస్ రావు, చావా నారాయణ, తాజుద్దీన్, మంగ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మొదటి విడత గ్రామ పంచాయతీ నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించాలి
- ఎన్నికల విధుల పట్ల అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి
- రఘునాథపాలెం గ్రామ పంచాయతి కార్యాలయంలో మొదటి విడత పంచాయతి ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, నవంబర్ -28:**ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

గురువారం నుండి మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ మొదలైంది. రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చింతగుర్తి, గణేశ్వరం, రఘునాథపాలెం గ్రామాల నామినేషన్లు స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. దాఖలు చేసే నామినేషన్ ప్రతాలను పరిశీలించారు. ఎన్నికల విధులు, బాధ్యతల పట్ల సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, ఏలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

ఎన్నికల విధుల పట్ల అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత పోటీ అభ్యర్థుల ప్రకటన, వారికి గుర్తుల కేటాయింపు తదితర అంశాలపై పూర్తి భాద్యతతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

జిల్లాలోని 7 మండలాలలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో 192 సర్పంచ్, 1740 వార్డు సభ్యుల స్థానాలకు గురువారం నుండి ఈనెల 29 శనివారం వరకు ఉదయం గం.10-30 నిమిషాల నుండి సాయంత్రం 5.00 గంటలకు వరకు కేటాయించిన కేంద్రాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారని అన్నారు. మొదటి విడుతలో 3వేల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు ఎన్నికల నిర్వహణలో సంపూర్ణ మద్దతు ఎన్నికల సిబ్బందికి అందించాలని, ప్రతి గ్రామంలో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన మేర అధికారులు, సిబ్బంది, పోలీసు సుమారు 8వేల మంది నియామకం పూర్తి చేశామని అన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల వివరాలు, ఓటర్ జాబితా వివరాలు సంబంధిత పోటీ చేసే అభ్యర్థులకు సమాచారం అందిస్తామని అన్నారు. నామినేషన్ కేంద్రాల 100 మీటర్ల పరిధిలో ఎటువంటి ర్యాలీ, ప్రచారాలు అనుమతి లేవని, ఎన్నికల ప్రచార నిమిత్తం ర్యాలీ, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే పట్టుకుని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు.

కలెక్టర్ వెంట రఘునాథపాలెం మండల తహసీల్దారు శ్వేత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికి సంతోషాన్ని కలిగించే సంతృప్తికరమైన అభిరుచి అలవాటుగా ఉండాలి....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- చిన్నప్పటి నుండి తపాలా స్టాంపులను అసక్తిగా సేకరించాను
- వివిధ రకాల స్టాంపులతో దేశ చరిత్ర, సంస్కృతి, ప్రకృతి ప్రతిబింబిస్తాయి
- డి.పి.ఆర్.సి. భవనంలో నిర్వహిస్తున్న ఖమ్మం జిల్లాస్థాయి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, నవంబర్ -28**

తమకు సంతోషాన్ని కలిగించే సంతృప్తికరమైన అభిరుచి ప్రతి ఒక్కరికి అలవాటుగా ఉండాలని, దాని వలన వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, జిజ్ఞాస పెరగడానికి దోహదపడుతాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

డి.పీ.ఆర్.స భవనంలో గురువారం జిల్లా తపాలా శాఖ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే ఖమ్మం జిల్లా స్థాయి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ 2025 ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. ఏర్పాటు చేసిన వివిధ రకాల తపాలా స్టాంపుల ప్రదర్శనను విద్యార్థులతో కలిసి అసక్తిగా కలెక్టర్ తిలకించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ చిన్నతనంలో తాను పోస్టల్ స్టాంపులను చాలా ఆసక్తితో సేకరించేవాడినని, స్నేహితులతో తపాలా స్టాంప్ లను మార్చుకొని చాలా పెద్ద కలెక్షన్ పెట్టుకునే వాడినని గుర్తు చేసుకున్నారు. ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ లో పాల్గొన్నడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

చిన్నతనంలో కరీంనగర్ జిల్లాకు చెందిన చాలా మంది ఉపాధి అవకాశాల కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారని, స్నేహితుల పేరెంట్స్ గల్ఫ్ దేశాలకు వెళ్లినప్పుడు అక్కడి స్టాంపులు తీసుకుని రావాలని కోరినట్లు కలెక్టర్ తెలిపారు. స్టాంపుల సేకరణ చాలా సంతోషాన్ని కలిగించిందని, అది ఒక దేశ చరిత్ర, సంస్కృతి, ప్రకృతి, విజ్ఞానం చూపిస్తుందని అన్నారు.

ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ పిల్లలకు చాలా ఉపయోగ పడుతుందని అన్నారు. ప్రతి ఒక్క వ్యక్తికి ఆనందాన్ని కల్గించే ఒక హాబీ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. హాబీ మన వ్యక్తిత్వం, పరిశోధనతత్వం, ఆత్మవిశ్వాసం, జిజ్ఞాస, క్రమశిక్షణ పెరగడానికి ఉపయోగ పడుతుందని అన్నారు.

ప్రస్తుత జనరేషన్ ఎక్కువ డిజిటల్ వైపు అడుగులు వేస్తుందని, ఔట్ డోర్ యాక్టివిటిస్, స్నేహితులతో బయట ఆడుకోవడం చాలా తగ్గిపోయిందని, దీని వలన లాభాల కంటే నష్టం ఎక్కువగా జరుగుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. పిల్లలు డిజిటల్ ప్లాట్ ఫారం మొబైల్, ఇన్స్టగ్రామ్, ఫేస్బుక్, వాట్సప్, యూట్యూబ్ లలో తక్కువ సమయం గడపాలని కలెక్టర్ సూచించారు.

ఫిలాటెలిక్ అలవాటు పోస్టల్ స్టాంపు సేకరణ చాలా ఆనందం కలిగిస్తుందని, మనం కొంచెం శ్రమ పెట్టి సేకరించిన స్టాంపులు లేదా ఇతర హాబీల వలన మనకు అధిక సంతృప్తి వస్తుందని అన్నారు. పోస్టల్ స్టాంపు సేకరణ అలవాటు భవిష్యత్తు తరాలకు అందించాలని కలెక్టర్ కోరారు.

అనంతరం జిల్లా పోస్టల్ భీమాపాలసీ పరిహారం చెక్కులను లబ్ధిదారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అందజేశారు.

ఈ కార్యక్రమంలో తపాలా శాఖ పర్యవేక్షకులు వీరభద్ర స్వామి, పోస్ట్ ఆఫీస్ సిబ్బంది, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మసాగర్ లో మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లీషు ఒలంపియాడ్ ఎడ్యు క్వెస్ట్ పోటీలు ప్రారంభం







**సి కె న్యూస్ నవంబర్ 27 గురువారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యా పరిశోధక సంస్థ , తెలంగాణ ఆంగ్ల భాష ఉపాధ్యాయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో, ధర్మసాగర్ మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లీష్ ఒలంపియాడ్, ఎడ్యుక్వెస్ట్ పోటీలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని డాక్టర్ అబ్దుల్ కలాం టీచింగ్ లెర్నింగ్ సెంటర్ భవనంలో నిర్వహించారు. ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ధర్మ ప్రకాష్ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్లంలో ప్రావీణ్యత పొందడం తప్పనిసరి అయిందని, ఆంగ్లభాష ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సంవత్సరం నాలుగు దొంతర్లుగా అంటే పాఠశాల మండల ,జిల్లా ,రాష్ట్రస్థాయి లో ఆంగ్ల భాష పై పట్టు సాధించే దిశన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఇలాంటి ప్రతిభ పోటీలలో పాల్గొని ఆంగ్లం సంపత్తి పెంపొందించుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు ప్రీతి , పద్మ సమన్వయకర్తలుగా వ్యవహరించిన ఈ పోటీలో ఉపాధ్యాయులు రవీందర్, రాజులు న్యాయ నిర్ణేతలుగా మూల్యాలంకనం చేశారు. ఒలంపియాడ్ జూనియర్స్ లో జ్యోషిక సాయి పేట, సీనియర్స్లో సాత్విక నారాయణగిరి ,ఎడ్యుక్వెస్ట్ లో జూనియర్స్ లో శరణ్య దేవునూరు ,సీనియర్స్ లో జాహ్నవి తాటికాయల విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలియజేశారు.

## సర్పంచ్ అభ్యర్థి గా నామినేషన్ దాఖలు చేసిన కిలారు మనోహర్.

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి** చింతకాని మండల కేంద్రంలోని సర్పంచ్ స్థానానికి మొదటి నామినేషన్ దాఖలు చేసిన కిలారు మనోహర్ బాబు.గురువారం నుంచి మొదలైన గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ లో భాగంగా నామినేషన్ దాఖలు చేసిన కిలారు మనోహర్.కిలారు మనోహర్ ఇంటి నుంచి పెద్ద ఎత్తున మండల కేంద్రంలో ప్రధాన వీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం లో మొదటి నామినేషన్ సెట్ ను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ నీటి సంఘం అధ్యక్షుడు కిలారు జగన్మోహనరావు,మాజీ సర్పంచ్ కిలారు సరోజిని,మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు,బాబూరావు,కోలా నాగేశ్వరావు,రాజు,రహమతుల్లా,ఖాజా,షంషుద్దీన్,జహీర్,రామకృష్ణ,నాగరాజు,మరియు పెద్ద సంఖ్యలో మనోహర్ బాబు యూత్ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## సర్పంచి అభ్యర్థిగా ఏర్పుల వెంకటేశంను ప్రకటించిన గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబరు 27.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వేములకొండ గ్రామంలో కాంగ్రెస్ గ్రామ శాఖ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు కలసి గ్రామ శాఖ అధ్యక్షులు ఏర్పుల వెంకటేశంను సర్పంచి అభ్యర్థిగా తీర్మానం చేస్తూ గ్రామ శాఖ నిర్ణయించినది.

సర్పంచ్ అభ్యర్థి ఏర్పుల వెంకటేశం మీడియాతో మాట్లాడుతూ సర్పంచ్ అభ్యర్థిగా నా పేరు ప్రకటించినందుకు గ్రామ శాఖ నాయకులకు గ్రామ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు. వేములకొండ గ్రామ ప్రజలు నాకు ఓటు వేసి గెలిపించి నన్ను ఆశీర్వదించాలని పేరుపేరునా మీడియా ద్వారా గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపినారు.

గ్రామ అభివృద్ధి కోసం పాటుపడతానని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ద్వారా నిధులు తీసుకొచ్చి గ్రామాభివృద్ధికి గ్రామ శాఖ కమిటీ సభ్యుల సమక్షంలో గ్రామ పెద్దల సమక్షంలో అభివృద్ధి చేస్తానని మాట్లాడినారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాయకులు పాల్గొన్నారు.

## డిప్లొమా కోర్సులకు దరఖాస్తు గడువు డిసెంబర్ 1 వరకు పొడిగింపు...


**ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంకర్**

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, నవంబర్ 28:**డిప్లొమా కోర్సులకు దరఖాస్తు గడువు డిసెంబర్ 1 వరకు పొడిగించడం జరిగిందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల నందు డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నిషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ 2 సంవత్సరాల వ్యవధి గల కోర్సులలో 30 చొప్పున సీట్లు ఉన్నాయని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

అర్హులైన విద్యార్థులలో మొదటి ప్రాధాన్యత బైపిసి విద్యార్థులకు ఉంటుందని, తర్వాత ఎంపిసి, ఇతర విద్యార్థులకు తదుపరి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. అభ్యర్థులు ముందుగా %ప్ట్రజూం:7/ంజూఎవ్.వశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీజ.ఱఅ%/ నందు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫారం ప్రింట్ తీసుకొని అవసరమైన ధృవపత్రాలతో కలిపి డిసెంబర్ 1న సాయంత్రం ఐదు గంటల లోపు ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో సమర్పించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆటో డ్రైవర్ మిస్సింగ్



**నవంబర్ 27 (సీ కే న్యూస్) చేగుంట :**మాసాయిపేట గ్రామానికి చెందిన సండూరి యాదగిరి వయస్సు (45) తండ్రి పోచయ్య, వృత్తి ఆటో డ్రైవరు, తేదీ 24. 11. 2025 నాడు ఉదయం ఎనిమిది గంటలకు తన ఆటో తీసుకొని కిరాయికి బయలుదేరి తిరిగి ఇప్పటివరకు ఇంటికి రాకపోవడంతో, చుట్టుపక్కల మరియు బంధువుల వద్ద వెతికిన ఎలాంటి ఆచూకీ తెలియలేదు, ఇట్టి విషయంలో అతని భార్య అయినా సండూరి రేణుక వయసు (35) ఫిర్యాదు మేరకు ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు,

## జిల్లాస్థాయి దివ్యాంగుల ఆటల పోటీలు...



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),నవంబర్ 27,అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో దివ్యాంగుల ఆటల పోటీలు నవంబర్ 29 శనివారం న ప్రగతి మైదానం, బూడిద గడ్డ కొత్తగూడెం నందు నిర్వహించడం జరుగుతుంది. జూనియర్ కేటగిరి 18 సంవత్సరాల లోపు, సీనియర్ కేటగిరి 18 నుంచి 54 సంవత్సరాల లోపు వారు అర్హులు. కేటగిరి(బాలలు/బాలికలు, పురుషులు/మహిళలు) వారిగా అంధులకు - షార్ట్ పుట్, రన్నింగ్, చెస్. బధిరులకు - షాట్ పుట్, జావెలిన్ త్రో, రన్నింగ్. శారీరక దివ్యాంగులకు - షాట్ పుట్, జావెలిన్ త్రో, క్యారం. ఇంటలెక్చువల్ డిసేబులిటీ - షార్ట్ పుట్, రన్నింగ్ క్రీడలు నిర్వహించబడును.

ఈ క్రీడలలో మొదటి స్థానంలో నిలిచిన వారికి దివ్యాంగుల సంక్షేమ శాఖ హైదరాబాద్ వారు ప్రత్యేక స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణనిచ్చి, రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొనేందు కు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. కావున జిల్లాలోని ఆసక్తి కలిగిన దివ్యాంగ క్రీడా కారులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనినా పత్రిక ప్రకటన ద్వారా తెలియజేస్తున్నారు. ఇతర వివరాలకు 6301981960, 8331006010 సంప్రదించగలరు.

## చేగుంట నూతన మార్కెట్ కమిటీ డైరెక్టర్లను సన్మానించిన, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్

నవంబర్ 27, (సి కే న్యూస్)
చేగుంట



చేగుంట మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ ఆధ్వర్యంలో నూతనంగా నియామకమైన చేగుంట మార్కెట్ డైరెక్టర్ మెహమ్మద్ ముజామిల్, కాషాబోయిన శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నియమించబడిన డైరెక్టర్లు మార్కెట్ వ్యవస్థలో పారదర్శకత, రైతుల శ్రేయస్సు, కొనుగోలు ప్రక్రియ సరళీకరణ, రైతు బంధు%-%రైతు సాధికారత పథకాల అమలు వంటి అంశాలలో ప్రత్యేక దృష్టి సారించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.
రైతులకు అందే సేవలను మరింత విస్తరించేందుకు డైరెక్టర్లు చురుకైన పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు వడ్ల నవీన్, మండల్ జనరల్ సెక్రటరీ కోండి శ్రీనివాస్, కాషాబోయిన మహేష్, మండల్ యూత్ అధ్యక్షులు మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన వ్యయ పరిశీలకురాలు లావణ్య.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 27, మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యం లో, నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలు పాటిస్తూ కొనసాగుతున్నాయో లేదో తెలుసుకునేందుకు గురువారం ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య అశ్వాపురం మండలంలోని నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. రాంచంద్రపురం, మొండికుంట, నెల్లిపాక, మల్లిమడుగు, అశ్వాపురం, తురవారిగూడెం గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా వ్యయ పరిశీలకురాలు అభ్యర్థులు సమర్పిస్తున్న నామినేషన్ పత్రాలు, జతపరచిన అఫిడవిట్లు, ఖర్చుల వివరాలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు పరిస్థితులను పరిశీలించారు.
వ్యయ పరిశీలకులు లావణ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు వ్యయం వివరాలు సమర్పించినట్లు అయితే గెలుపు రద్దు అవుతుందనే విషయాన్ని కూడా అభ్యర్థులకు స్పష్టంగా తెలియ చేయాలని ఆమె తెలిపారు. గ్రామపంచాయతీలో పోటీ చేసే అభ్యర్థలకు వ్యయాలకు సంబంధించి ప్రత్యేక బ్యాంకు ఖాత ఉండాలని ఆమె సూచించారు. సర్పంచ్,వార్డు మెంబర్లు నిబంధనలకు అనుగుణంగానే ఖర్చు పెట్టాలనే విషయము అభ్యర్థులకు స్పష్టంగా తెలియ చేయాలని అధికారులకు సూచించారు.
ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తోనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు



- రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల
- కాంగ్రెస్ కార్యకర్తలు పంచాయతీ ఎన్నికల సమరానికి సిద్ధం కావాలి-కొత్వాల

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ పాల్వంచ ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 27,కాంగ్రెస్ ప్రభుత్వం హయాం లోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస రావు అన్నారు. పాల్వంచ మండల,పట్టణ ముఖ్య నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. స్థానిక అయ్యప్ప నగర్ లోని రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో కొత్వాల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం 2 లక్షల రుణ మాఫీ,ఎకరానికి 12 వేల రూపాయల రైతు బరోసా, రైతు బీమా, ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు,సన్న ధాన్యం పై క్వింటాకు 500 రూ// బోనస్ వంటి కార్యక్రమాలు చేపట్టిందన్నారు.మహిళల కోసం ఉచిత రవాణా సౌకర్యం పొదుపు గ్రూపులకు వడ్డీ లేని రుణాలు,ఇందిరమ్మ చీరల పంపిణీ, సబ్సిడీ పై గ్యాస్ పంపిణీ 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్,రేషన్ కార్డుల పంపిణీ,రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి గ్రామం లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు వివరించాలన్నారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల సమరానికై సిద్ధం కావాలన్నారు. కాంగ్రెస్ లో పొదెం పూర్ణ పాల్వంచ మండలం పరిధి లోని రెడ్డిగూడెం(ప్రభాత్ నగర్) గ్రామానికి చెందిన పొదెం పూర్ణాచందర్ రావు బి ఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేసి కొత్వాల,యర్రంశెట్టిల నాయకత్వం లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ బరిపటి వాసుదేవరావు,మాజీ జడ్పీటీసీ ఎర్రం శెట్టి ముత్తయ్య,మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, ఆర్టిఏ మెంబెర్ బాదర్ల జోషి, పెద్దమ్మ గుడి మాజీ చైర్మన్ మహీపతి రామలింగం, కాంగ్రెస్ నాయకులు అయిత గంగాధర్, దేవీలాల్, పైడిపల్లి మహేష్,ఉండేటి శాంతివర్ధన్,దార చిరంజీవి,లింగ్యా నాయక్,బ్రహ్మచారి,అరుణా రెడ్డి,డిష్ నాగేశ్వర రావు,%ంఎ% చాంద్ పాషా,వై వెంకటేశ్వర రావు,ధర్మసోత్ ఉపేందర్,వాసం మంగయ్య,సామా జనార్ధనరెడ్డి,గంధం నరసింహారావు,భద్రా రెడ్డి,అజ్మీర జగదీష్ భూక్యా గిరిప్రసాద్,బానోత్ గిరి,భావ్ సింగ్, భాషా,మాలోత్ కోటి నాయక్,వాసుమల్ల సుందర్,బోశెట్టి సాంబయ్య,బండి ఉదయ్,కొత్తపల్లి రవి,కటుకూరి శేఖర్,బండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు లేని భద్రాద్రి జిల్లాగా తీర్చిదిద్దుకుందాం...

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 27,జిల్లాలో అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు స్వచ్ఛంద సేవా సంస్థలు కలిసి బాల్యవివాహాలు జరగకుండా చూడాలని న్యాయ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్ పిలుపునిచ్చారు. జాతీయ బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించు కొని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల- పాల్వంచ నందు ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన అనేది ప్రజల భాగస్వామ్యంతో కూడుకున్న అంశమని కావున ప్రజలు యువత కౌమార బాలబాలికలు అధికారులు ఇలా అందరి సమన్వయంతోటి సమిష్టి కృషితోటి ప్రయత్నం చేస్తే 2030 లోపే బాల్య వివాహాలను మనం భద్రాద్రి జిల్లాలో సమూలంగా నిర్మూలించవచ్చని పునరుద్ఘాటించారు. బాల్య వివాహ నిరోధక చట్టం 2006 గురించి, దాంట్లో ఉన్న కఠినతరమైన సెక్షన్ ల గురించి వివరించారు. ఎవరైనా ఈ చట్టాన్ని అధిగమించి బాల్య వివాహాలు చేసినట్లయితే జైలు శిక్ష మరియు జరిమానా విధించబడుతుందని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని భేటీ పడావో బేటి బచావో కార్యక్రమం ద్వారా ఆడపిల్లల యొక్క విద్య ఆరోగ్యం ఉపాధి అవకాశాల పట్ల నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు . బాల్య వివాహాలు ఎవరైనా చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు బాలల సమస్యల పరిష్కారానికి చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ చేసి తెలపాలన్నారు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు అంబేద్కర్, సాదిక్ పాషా మాట్లాడుతూ బాల్య వివాహాలు అనేవి ఒక సామాజిక దురాచారం అని అనదిగా కొనసాగుతున్నటువంటి ఈ సాంఘిక దురాచారాన్ని అందరం కలిసి సమూలంగా నిర్మూలించాలని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అనునిత్యం గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని బాలల పరిరక్షణ విభాగం ద్వారా బాలలకు సేవలను అందిస్తున్నట్లు తెలిపారు .
డిస్టిక్ హెల్త్ ఆఫీసర్ తుకారం రాథోడ్ చిన్న వయసులోనే వివాహం చేయడం వల్ల బాలికలకు శారీరక మానసిక ఆరోగ్య రుగ్మతలు వస్తాయని సరైన పరిపక్వత లేక పుట్టే పిల్లలు కూడా అనేక రకాల లోపాలతో పుట్టడం వల్ల జీవితాంతం ఆ మనోవేదన అనుభవించాల్సి వస్తుందని కొన్ని సందర్భాలలో మాత శిశు మరణాలు కూడా జరుగుతాయని ఈ నష్టాల వలన స్త్రీ పురుష నిష్పత్తి కూడా గణనీయంగా పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆడపిల్లలు కౌమార దశలో వచ్చి మార్పుల పట్ల ఆందోళన పడకుండా అంగన్వాడి ఆశా కార్యకర్తలు మరియు అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రాలలో నివృత్తి చేసుకోవాలని రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకుంటూ చక్కని ఆరోగ్యంతో చదివి తల్లిదండ్రులకు జిల్లాకు మంచి పేరు తేవాలని తెలిపారు షీ టీం ఎస్సై రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదివే బాల బాలికలకు మత్తు పదార్థాలు సామాజిక మాధ్యమాలు చరవాణి వినియోగం పట్ల ప్రతి వారాంతంలో విషయాన్ని నిపుణులచే కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వారిని సరైన మార్గంలో ఉండేలా చూస్తున్నామని తెలిపారు పిల్లలు ఎక్కువగా లవ్ అండ్ అట్రాక్షన్ కి గురవుతున్నారని చిన్న వయసులో పెళ్లిళ్లు చేసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. యువత భవిష్యత్తు పట్ల సరైన అవగాహనతోటి చదువుకోవాలని చెడు వ్యసనాలకు బానిసైతే జీవితం దుర్భరం అవుతుందని అన్నారు . ప్రభుత్వ జూనియర్ కాలేజ్ పాల్వంచ ప్రిన్సిపల్ శంకర్ మాట్లాడుతూ చిన్న వయసులో బాల్య వివాహాలను చేయడం వలన బాలికలకు వచ్చే అనారోగ్య సమస్యలు మానసిక శారీరక ఇబ్బందులు మాతా శిశు మరణాలు రక్తహీనత సుఖ వ్యాధులు సంక్రమణం తదితర అంశాలపై వివరిస్తూ ఆరోగ్యంగా ఉండడానికి బాలికలు తీసుకోవలసి నటువంటి తగు జాగ్రత్తలపై సూచనలు చేశారు ఎయిడ్ సంస్థ డైరెక్టర్ హరి ప్రసాద్ రావు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా జిల్లాలో గత మూడేళ్లుగా బాల్యవివాహాల నిర్మూలన బాలలపై లైంగిక దాడి బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణాల, బాల్యవివాహాలు పై నిరంతరం క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ప్రజలకు పిల్లలకు అందరికీ అవగాహన కల్పిస్తూ 2030 లోపే బాల్యవివాహ రహిత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాగా ప్రకటించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు అందుకు సహకరిస్తున్న జిల్లా స్థాయి అధికారులందరి కీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు అనంతరం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలలో విజేతలైన వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు బహుమతుల ప్రధానం మెమొంటోలు అతిథులు అందరి చేతులమీదుగా అందించారు.
అనంతరం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా అందరూ ప్రతిజ్ఞ చేయడం జరిగింది .
ఈ కార్యక్రమం నందు ఎయిడ్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ వి రాజేష్, డైరెక్టర్ పోపూరి హరి ప్రసాద్ రావు, సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న , పంచాయతీ సెక్రటరీ వంశీకృష్ణ ,యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్సై లక్ష్మణ్, ఏఎస్ఐ నాగయ్య, 1098 కోఆర్డినేటర్ సందీప్ యూనిట్, ఉమెన్ హబ్ బాధ్యులు రూప డీసీపీయూ యూనిట్, ఎయిడ్ సంస్థ సోషల్ మొబలైజర్స్ మోహన్, మాన్సింగ్, జ్యోతి, మౌనిక విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## గిరిజన లంబాడి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జేపీసీ జిల్లా మహిళా విభాగం చైర్మన్ గా బానోత్ గంగ బాయి.

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జేఏసీ అధికార ప్రతినిధి గా భూక్యా రవి రాథోడ్



సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి (వెంకటేష్),నవంబర్ 27 ,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కొత్తగూడెం క్లబ్ యందు లంబాడి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జుంకీ లాల్ నాయక్ అధ్యక్షనాన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో, జిల్లా జేఏసీ అధికార ప్రతినిధి గా భూక్యా రవి రాథోడ్ ని , జిల్లా జేఏసీ మహిళా విభాగం చైర్మన్ బానోత్ గంగ బాయి నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశ%శీ%లో జేఏసీ చైర్మన్ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ చేతుల మీదుగా భూక్యా రవి రాథోడ్ నియామక పత్రాలను తీసుకున్నారు. నాయకులు, సభ్యులు, మరియు వివిధ లంబాడి సంఘాల ప్రతినిధులు ఈ సందర్భంగా భూక్యా రవి రాథోడ్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో లంబాడిపై జరుగుతున్న అన్యాయలను, 1/70 ఏజెన్సీ చట్టాలను పక్కట్ బందీగా తిరిగి పొందే విధంగా కృషితో సమాజాభివృద్ధి కోసం కమిటీ కార్యాచరణను మరింత బలపరిచేందుకు నూతన జిల్లా అధికార ప్రతినిధి గా కృషి చేస్తామని సమావేశంలో నాపై నమ్మకముతో ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని బంజారాజాతి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ సమస్య పరిష్కారం అయ్యే దిశగా ఉద్యమాలను నిర్వహిస్తాను నియమించిన చైర్మన్ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ సెక్రటరీ జనరల్ గా బానోత్ రమేష్ నాయక్, బాధ్యత రహితంగా నడుచుకుంటామని అదేవిధంగా కమిటి సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో జిఎల్ఎస్ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ లావుడియా ప్రసాద్ నాయక్, వెంకటేష్ నాయక్,జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి రాంబాబు నాయక్,జిల్లా అధికార ప్రతినిధి వంకాడోత్ హతిరం నాయక్, మహిళా విభాగం జిల్లా చైర్మన్ బానోత్ గంగ బాయి, దేవిలాల్ నాయక్, లాలు నాయక్, జాయిన్ సెక్రెటరీ బానోత్ శ్రీనివాస్ నాయక్, మంగీలాల్ నాయక్, లావూరి శ్రీనివాస్ నాయక్, శీను నాయక్, వెంకట్ నాయక్, జేఏసీ నాయకులు పుణ్య నాయక్ పాల్గొన్నారు.

# ఇల్లందు ఆర్యవైశ్య కార్పొరేషన్ ఇన్‌ఛార్జిగా ప్రతాపని మోహన్‌రావు



సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి (వెంకటేష్) నవంబర్ 27 , ఇల్లందు నియోజకవర్గ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఇన్‌ఛార్జిగా ప్రతాపని మోహన్‌రావును నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం జిల్లా కార్పొరేషన్ ఇన్‌ఛార్జ్ ప్రొద్దుటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పేద ఆర్యవైశ్యుల సంక్షేమం, ఆర్థిక పురోగతికి కార్పొరేషన్ చేపట్టిన పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా మోహన్‌రావు సమర్థవంతంగా పనిచేస్తారని విశ్వసిస్తున్నాం అని తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకి చేరేలా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. బాధ్యతలు స్వీకరించిన ప్రతాపని మోహన్‌రావు మాట్లాడుతూ సమాజ అభ్యున్నతి కోసం కృషి చేస్తానన్నారు. అర్హులైన పేద ఆర్యవైశ్య కుటుంబాలకు కార్పొరేషన్ పథకాలను పారదర్శకంగా అందించేందుకు నిబద్ధతతో పని చేస్తాను అని తెలిపారు. ఈ పదవి బాధ్యతలు అప్పగించినందుకు ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య, రాష్ట్ర చైర్మన్ కల్వ సుజాత, జిల్లా ఇన్‌ఛార్జ్ నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్, యువజన సంఘం అధ్యక్షుడు నరేంద్రుల అను, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల చంద్రశేఖర్, శ్రీ హరి హర క్షేత్రం అయ్యప్ప స్వామి దేవాలయం కమిటీ డైరెక్టర్ కండె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ హాస్పిటల్‌ను వెంటనే మంజూరు చేయాలి



● సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్.

**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి (వెంకటేష్ ) నవంబర్ 27,** సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రం లో జరిగిన సమావేశానికి ఉద్దేశించి సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల ప్రాణాల రక్షణ ప్రభుత్వ బాధ్యత

అన్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అత్యాధునిక సేవలతో కూడిన ప్రత్యేక క్యాన్సర్ హాస్పిటల్‌ను ప్రభుత్వం తక్షణమే మంజూరు చేయాల్సిన అవసరం తీవ్రంగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా కోల్‌బెల్ట్ ప్రాంతాలైన మణుగూరు, కొత్తగూడెం, ఇల్లందు మండలాల్లో ఖనిజ తవ్వకాల వల్ల ఏర్పడుతున్న దుమ్ము, కాలుష్య గాలులు, కలుషిత నీరు, ఆహార పదార్థాల ద్వారా ప్రజలు పెద్ద ఎత్తున క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కోల్‌బెల్ట్ పరిసరాల్లో నివసిస్తున్న స్థానిక గిరిజనులు, కార్మికులు నిత్యం దుమ్ము%-%ధూళిలో పని చేస్తూ ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు, వివిధ రకాల క్యాన్సర్లతో తీవ్రంగా నష్టపోతున్నా సరైన నిర్ధారణ కేంద్రాలు, ఆధునిక చికిత్సా సదుపాయాలు జిల్లాలో లేవని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కోల్‌బెల్ట్ ప్రాంతాలన్నీ పూర్తిగా ఏజెన్సీ ప్రాంతాలేనని, అక్కడ నివసించే గిరిజన ప్రజలు ఇప్పటికే రవాణా, వైద్యం, పరిశుభ్రత, తాగునీటి వంటి మౌలిక సదుపాయాల కోసం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్యాన్సర్ లక్షణాలు బయటపడే సరికి చాలా మంది చివరి దశకు చేరుకుని ప్రాణాలు కోల్పోతున్నారని, వారికి తెలియకముందే క్యాన్సర్ మృత్యుదేవిలా కుటుంబాలను కబళిస్తున్నదని .తమ ప్రాంతంలోనే పూర్తిస్థాయి క్యాన్సర్ హాస్పిటల్ లేకపోవడంతో పేద గిరిజనులు, కార్మికులు హైదరాబాద్, ఇతర దూర ప్రాంతాలకు వెళ్లలేక అర్ధాంతరంగా చికిత్స మానేసే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. డయాగ్నస్టిక్ పరీక్షలు, కీమోథెరపీ, రేడియేషన్, శస్త్రచికిత్స %-% ఇవన్నీ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచితంగా లేదా చౌకగా అందుబాటులోకి రావాల్సిన అత్యవసరం ఉందని డిమాండ్ చేశారు. కోల్‌బెల్ట్ ప్రాంతాల ద్వారా ప్రభుత్వం, కంపెనీలు వేల కోట్ల ఆదాయం సంపాదిస్తున్న సందర్భంలో, అక్కడ పనిచేసే కార్మికుల ఆరోగ్య పరిరక్షణపై కనీస శ్రద్ధ లేకపోవడం అన్యాయమని మండిపడ్డారు. కోల్‌బెల్ట్ ఏరియా ఉన్న అన్ని ఏజెన్సీ మండలాల్లో ఆరోగ్య శిబిరాలు, క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించి, గుర్తించిన రోగులందరికీ ఉచిత చికిత్స కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ నిధులను నిజమైన ఉద్దేశ్యం మేరకు వినియోగించి, స్థానిక గిరిజన గిరిజనుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు, ఆరోగ్య కేంద్రాలు, మొబైల్ మెడికల్ యూనిట్లు ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో పనిచేస్తున్న గిరిజన కుటుంబాలకు ఆరోగ్య బీమా కవరేజ్, ప్రమాద భత్యం, పింఛన్లు, పునరావాస ప్యాకేజీలు కూడా ప్రభుత్వం ప్రకటించాలని ఆయన హెచ్చరించారు. "ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజనుల ఆర్తనాదాన్ని వినాలి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అత్యాధునిక క్యాన్సర్ హాస్పిటల్‌ను వెంటనే మంజూరు చేసి, నిర్మాణం ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలకు దిగుతాం అని సేవాలాల్ సేన నాయకులు స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా గిరిజన సంఘాలు, కార్మిక సంఘాలు, జనసంఘాలు కలిసి త్వరలోనే పెద్ద స్థాయి ఆందోళన కార్యక్రమాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు రవి రాథోడ్, భూక్య శ్రీను నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు బోడ రమేష్ నాయక్,జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి జరపలా లాలు నాయక్ పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వచనాలు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**

మండలపరిధిలోనినాగులంచ గ్రామానికిచెందినమాజీజెడ్పిటిసి పడిశాల నాగమణి,పడిశాల శ్రీను దంపతుల కుమారుడు పడిశాల భార్గవ్ పెండ్లిసందర్భంగా పలువురు ఆశీర్వచనాలు అందజేసినారు. కార్యక్రమంలో జిల్లా టిఆర్ఎస్ నాయకులు వంకాయలపాటి లచ్చయ్య, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య ,మండల టిఆర్ఎస్ నాయకులు కొల్లి బాబు, ముప్పిడి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల బాబు, సిపిఎం నాయకులుసామినేనిఅప్పారావు తదితరులు ఉన్నారు.

## మండల స్థాయి ఆంగ్ల భాష పోటీలలో చిన్నమండవ విద్యార్థిని సత్తా....



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** తెలంగాణ ఇంగ్లీష్ ఒలంపియాడ్ ఎడ్యుక్వెస్ట్ టాక్ కాంపిటీషన్స్ సౌజన్యంతో ఖమ్మం జిల్లా ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్‌లి (లి %జు.ా.ు.ూ%) ఆధ్వర్యంలో చింతకాని మండల స్థాయి ఆంగ్ల భాష పోటీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నామవరం నందు నిర్వహించటం జరిగింది వక్తృత్వ పోటీలలో సీనియర్స్ విభాగంలోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్న మండవ విద్యార్థినీ నాగెల్లి గీతిక ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైనది ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థినినీ అభినందించడం జరిగింది

## వృద్ధుడి అంత్యక్రియలకు సురక్ష సేవా సంఘం సహాయం...



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, సీ కే న్యూస్ ప్రతినిధి,** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామం సింగరేణి కాలనీలో గత 25 సంవత్సరాలుగా కిరాయికి నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్న పార్వతమ్మ భర్త (83), మంచానికి పరిమితమై ఉండగా ఆమె చూసుకుంటూ వచ్చారు. కుటుంబం, బంధువులు ఎవరూ లేని పరిస్థితిలో జీవిస్తున్న ఈ దంపతులకు ఈరోజు ఉదయం 5 గంటలకు భర్త మరణించడంతో పార్వతమ్మ తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ సమాచారం సురక్ష సభ్యుడు శివ గౌడ్ ద్వారా తెలిసిన వెంటనే, సురక్ష సేవా సంఘం సభ్యులు స్పందించారు. సంఘం గ్రూప్ సభ్యుల నుండి విరాళాలు సేకరించి, వృద్ధుడి అంత్యక్రియల కోసం ?10,000/- ఆర్థిక సహాయం అందజేశారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరించేందుకు సంఘం కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్, క్రియాశీలక సభ్యులు యాకుబ్, శివగౌడ్, రంగారెడ్డి, రమేష్, నారాయణ పాల్గొన్నారు.

## వృద్ధుడి అంత్యక్రియలకు సురక్ష సేవా సంఘం సహాయం...

**సీ కే న్యూస్ ప్రతినిధి,** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామం సింగరేణి కాలనీలో గత 25 సంవత్సరాలుగా కిరాయికి నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్న పార్వతమ్మ భర్త (83), మంచానికి పరిమితమై ఉండగా ఆమె చూసుకుంటూ వచ్చారు. కుటుంబం, బంధువులు ఎవరూ లేని పరిస్థితిలో జీవిస్తున్న ఈ దంపతులకు ఈరోజు ఉదయం 5 గంటలకు భర్త మరణించడంతో పార్వతమ్మ తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ సమాచారం సురక్ష సభ్యుడు శివ గౌడ్ ద్వారా తెలిసిన వెంటనే, సురక్ష సేవా సంఘం సభ్యులు స్పందించారు. సంఘం గ్రూప్ సభ్యుల నుండి విరాళాలు సేకరించి, వృద్ధుడి అంత్యక్రియల కోసం ?10,000/- ఆర్థిక సహాయం అందజేశారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరించేందుకు సంఘం కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్, క్రియాశీలక సభ్యులు యాకుబ్, శివగౌడ్, రంగారెడ్డి, రమేష్, నారాయణ పాల్గొన్నారు.

# తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి పదవి విరమణ..



సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన మహోత్సవం..

**రంగారెడ్డి జిల్లా, తుర్కయంజాల్, సీ కే న్యూస్ ప్రతినిధి,:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ కందుల అమరేందర్ రెడ్డి పదవి విరమణ మహోత్సవం గురువారం తొర్రూరు ఫంక్షన్ హాల్ ఘనంగా జరిగింది. మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, స్థానిక ప్రముఖులు హాజరయ్యారు. 32 సంవత్సరాలపాటు పంచాయతీరాజ్ శాఖ, మున్సిపల్ శాఖల్లో అంకితభావంతో సేవలందించిన అమరేందర్ రెడ్డి తన క్రమశిక్షణ, విధినిబద్ధత, ప్రజాసేవా విలువలతో అందరి ప్రశంసలు పొందారు. సహచరుల సమస్యలపై స్పందించే స్నేహశీలి అధికారి, మృదుస్వభావి వ్యక్తిత్వం వల్ల ఆయన అందరి అభిమానాన్ని కూడగట్టుకున్నారు. విధి నిర్వహణలో చూపిన ప్రతిభకు పలుమార్లు ఉత్తమ అధికారి అవార్డులు కూడా సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కమిషనర్‌గా ఆయన చేసిన సేవలు మున్సిపాలిటీ అభివృద్ధికి దోహదపడ్డాయని, ఆయన చూపిన దారిదీపాన్ని కొనసాగించేందుకు తమ వంతు కృషి చేస్తామని సిబ్బంది వెల్లడించారు. అనంతరం కమిషనర్ ను అభినందించి సన్మానాలు చేయడం జరిగింది. పదవి విరమణ సందర్భంగా అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "సహచర సిబ్బంది ప్రేమ, సహకారం వల్లే నా సేవా ప్రయాణం సార్థకమైంది. ప్రజలకు సేవ చేయడం నాకు లభించిన గౌరవం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి : రాచకొండ సిపి జి.సుధీర్ బాబు..

● పదిహేను రోజుల్లో 110 మంది పట్టుబడ్డ పోకిరీలు.

**సి కే న్యూస్** మహిళలను వేధించే వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు.

బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో రాచకొండ షి టీమ్ మఫ్టీలో తిరుగుతూ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని తెలిపారు. బాలికలను, మహిళలను వెంబడించి వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా న్యాయస్థానంలో హాజరు పరుస్తూ, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నామని ఆయన అన్నారు.

రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు ఈరోజు రాచకొండ క్యాంప్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు.

అందులో భాగంగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో మహిళలను వేదింపులకు గురిచేస్తున్న 110 (మేజర్స్-74 ,మైనర్స్-36 ) మందిని ఎల్‌బి నగర్ ఉమెన్ సేఫ్టీ ఆఫీసులో, కౌన్సిలర్స్ తో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ నెల తేదీ 1 నుండి 15 వ తేదీ వరకు 135 పిర్యాదులు అందాయి.

ఫోన్ల ద్వారా వేదించినవి 34, సోషల్ మీడియా ద్వారా వేదించినవి 48, నేరుగా వేదించినవి 53 ఫిర్యాదులు అందాయని విమెన్ సేఫ్టీ వింగ్ డిసిపి టి. ఉషారాణి తెలిపారు.

అందులో ముఖ్యమైన కేసులు కొన్ని..

ప్రయాణికులపై దాడి చేసిన ఉబర్ ఆటో డ్రైవర్ పై క్రిమినల్ కేసు నమోదు, సోషల్ మీడియాలో వేదిస్తున్న ఒకరినీ అరెస్టు చేశారు. వేరే ఫోన్ నంబర్ల నుంచి కాల్స్ చేస్తూ యువతిని వేధించిన వ్యక్తిని అరెస్టు చేశారు. తుక్కుగూడ పార్కులో




అల్లరి చేస్తున్నారని సమాచారం రావడంతో వెంటనే స్పందించిన షీ టీమ్ మహేశ్వరం అక్కడికి చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకొని అతనిపై కేసు నమోదు చేయడం జరిగింది.

మొత్తం 49 అవగాహన కార్యక్రమాలు

ఈ నెల 1 నుండి 15వ తేదీ వరకు షీ టీమ్స్ రాచకొండ మొత్తం 49 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, దాదాపు 7481 మందికి మహిళా చట్టాలు, వారి యొక్క హక్కులు, నేరాలు మరియు జాగ్రత్తల గురించి వివరించి అవగాహన కల్పించడం జరిగింది.

మెట్రో-రైల్ డెకాయ్‌ఆపరేషన్స్

రాచకొండ షీ టీమ్స్ మెట్రో రైళ్లలో డెకాయ్ ఆపరేషన్సు నిర్వహించి, మహిళా కంపార్ట్మెంట్‌లోకి వెళ్ళి ప్రయాణిస్తున్న (8) మంది పురుషులను పట్టుకుని మెట్రో స్టేషన్ అదికారుల ద్వారా ఫైన్ వేయించడం జరిగింది. మహిళలు వేదింపులకు గురి అయినప్పుడు వెంటనే %డాఎజు ఎఖుఎం% ని, %ఞుఎట్టుఎశీఅఖు ఔష్టఫ్రాూజూజూ% నెంబర్ 8712662111 ద్వారా లేదా ఆ ప్రాంత షీ టీమ్ అధికారుల నంబర్లు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని డీసీపీ తెలిపారు. డిసిపి టి. ఉషా రాణి, ఎసిపి పల్లె వెంకటేశ్వర్లు ఇన్స్పెక్టర్లు ఎం. ముని, జి. అంజయ్య, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది, కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

## 48 లక్షల 10వేల చోరీ సొత్తును రికవరీ చేసిన జిఆర్పి రైల్వే పోలీసులు..




**ఒంగోలు సీ కే న్యూస్ ప్రతినిధి,నవంబర్ 27:** రైలు లో చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడు ను రైల్వే ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అరెస్టు చేసి 48 లక్షల 10 వేల విలువగల వస్తువులను రికవరీ చేసినట్లు జి అర్ పి రైల్వే పోలీసులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి తెలియచేశారు. రైల్వే పోలీసుల వివరాల మేరకుబీ చార్మినార్ ఎక్స్ప్రెస్ ఏసి కోచ్ లో బెంగళూరుకు చెందిన కేకే రెడ్డి అనే అతను కుటుంబ సభ్యులతో ప్రయాణిస్తున్నారనీ,వారికి సంబంధించిన బ్యాగును నిద్రిస్తున్న సమయంలో చీరాల ఒంగోలు మధ్య బ్యాగును చోరీ జరిగిందని గుర్తించి కేకే రెడ్డి అనే అతను ఒంగోలు జి ఆర్ పి పోలీసులకు సమాచారం అందించడం జరిగిందని జి ఆర్ పి నెల్లూరు రైల్వే డిఎస్పి తెలిపారు. వెంటనే జి ఆర్ పి మరియు రైల్వే పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి చాకచక్యంగా దొంగను పట్టుకొని అరెస్టు చేసి 48 లక్షల పదివేల రూపాయల విలువగల బంగారం వస్తువులు, రాడో వాచ్ లను రికవరీ చేసుకున్నామని జి ఆర్ పి నెల్లూరు రైల్వే డిఎస్పి తెలిపారు.ఏసీ భోగిలలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని తమ వస్తువులను జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జి ఆర్ పి సి ఐ మరియు ఇన్స్పెక్టర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.చాకచక్యంగా దొంగను పట్టుకున్న పోలీసులకు రివార్డులను అందజేశారు.

## ఏపూరు సర్పంచ్(బిఅర్ఎస్)అభ్యర్థిగా రామన్న నాయక్ నామినేషన్ దాఖలు

**సీ కే న్యూస్ ప్రతినిధి,** మండలంలోని ఏపూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బీఆర్ఎస్ పార్టీ తరపున బానోత్ రామన్న నాయక్ గురువారం రోజున సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, తాగునీరు,రోడ్లు పరిశుభ్రత,పేదరిక నిర్మూలన,విద్య వ్యవస్థల వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుని పనిచేసేందుకు తాను సిద్ధమని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బానోత్ చందా నాయక్,జాటోత్ మంగీలాల్, బానోత్ చందులాల్,విద్య సాగర్ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# బెండ, దొండ,బీన్స్ తో వెరైటీ ఫ్రై .. టేస్ట్ అదరాల్సిందే.. ఒక్కసారి తింటే అసలు వదలరు ! ..

**నాలుగు కూరలతో తింటేనే భోజనం పూర్తయినట్టు అనిపిస్తుంది కొందరికి. ఇంకొందరు ఒక్క కూర ఉన్నా చాలు. మెతుకు మిగల్చకుండా ప్లేట్ ఖాళీ చేస్తారు. తినే విషయంలో ఒక్కొక్కరికి ఒక్కో అలవాటు ఉంటుంది. చాలామంది పప్పు సాంబారులో పాపడాలు, వడియాలను నంజుకుని తింటుంటారు. వాటికి బదులుగా వివిధరకాల కూరగాయలతో ఫ్రైలు చేసుకొని కూడా తినొచ్చు.**





**కుర్‌కురీ బేండీ ఫ్రై తయారీకి కావలసినవి**

బెండకాయ తరుగు – ఒక కప్పు
పసుపు–చిటికెడు
కారం– ఒక టీ స్పూన్
ధనియాల పొడి– ఒక టీస్పూన్
జీలకర్ర పొడి– చిటికెడు
గరం మసాలా– అర టీ స్పూన్
చాట్ మసాలా– అర టీస్పూన్
శెనగపిండి– అర కప్పు
ఉప్పు –తగినంత
నూనె – సరిపడా

**తయారీ విధానం:** ఒక గిన్నెలో శెనగపిండి. ఉప్పు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, చాట్ మసాలా, పసుపు వేయాలి. అందులో నీళ్లు పోసి జారుగా కలపాలి. తర్వాత శుభ్రం చేసుకున్న బెండకాయ ముక్కలను పిండిలో ముంచి, నూనెలో డీప్ ఫ్రై చేయాలి. లేదంటే పిండిని గట్టిగా కలిపి ముక్కలకు పట్టించి ఫ్రై చేసుకోవచ్చు. ఈ కుర్ కురీ బేండీని పప్పులో సంజుకుంటే టేస్ట్ సూపర్ గా ఉంటుంది.

**క్రంచీ బీన్స్ ఫ్రై తయారీకి కావలసినవి**

బీన్స్– పావు కిలో
నూనె – సరిపడా
వెల్లుల్లి తరుగు –ఆరు
రెడ్ చిల్లీ ఫ్లేక్స్–ఒక టీ స్పూన్
ఉప్పు– తగినంత
జీలకర్ర– పావు టీ స్పూన్
ఆవాలు–పావు టీ స్పూన్
మిరియాల పొడి– చిటికెడు
కారం– కొద్దిగా
ఎండుకొబ్బరి పొడి– ఒక టేబుల్ స్పూన్ (కావాలంటే)

**తయారీ విధానం:** పాన్ లో నూనె వేడి చేసి జీలకర్ర, ఆవాలు, ముక్కలుగా తరిగిన బీన్స్ వేయాలి. పచ్చి వాసన పోయేవరకు వేగించాలి. ఐదు నిమిషాల తర్వాత వెల్లుల్లి తరుగు, రెడ్ చిల్లీ ఫ్లేక్స్, ఉప్పు, మిరియాల పొడి, కారం, ఎండుకొబ్బరి పొడి వేసి మగ్గించాలి. రెండు నిమిషాల తర్వాత స్టవ్ ఆపేయాలి. వీటిని స్నాక్స్ గా తినొచ్చు. అలాగే సాంబారు, పెరుగన్నంలో కూడా నంజుకోవచ్చు.

**దొండకాయ ఫ్రై తయారీకి కావలసినవి**

దొండకాయలు – అర కప్పు
జీలకర్ర – అర కప్పు
ఎండు మిర్చి– నాలుగు
పచ్చిమిర్చి తరుగు – ఒక టేబుల్ స్పూన్
ఇంగువ–చిటికెడు
పసుపు, కారం, గరం మసాలా, ధనియాల పొడి – ఒక్కోటి అర టీ స్పూన్ చొప్పున
కరివేపాకు– ఒక రెమ్మ
ఉప్పు– తగినంత
నిమ్మరసం– ఒక టీ స్పూన్
నూనె– సరిపడా

**తయారీ విధానం :** ఒక్కో దొండకాయను నిలువుగా నాలుగు ముక్కలు చేసి పక్కన పెట్టాలి. స్టవ్? పై పాన్? పెట్టి నూనె వేడి చేయాలి. అందులో జీలకర్ర, ఆవాలు, ఎండుమిర్చి, పచ్చిమిర్చి తరుగు, పసుపు, కరివేపాకు వేయాలి. అవన్నీ వేగాక దొండకాయ ముక్కలు వేసి ఫ్రై చేయాలి. తర్వాత దాంట్లో ఇంగువ, కారం, గరం మసాలా, ధనియాల పొడి, ఉప్పు, నిమ్మరసం వేసి కలిపి పావుగంట సేపు ఉడికించి దింపేయాలి. దీన్ని అన్నంలో కలుపుకోవచ్చు లేదా సాంబారులో నంజుకోవచ్చు.

# ప్రీమియం ఫీచర్లతో మార్కెట్లోకి హీరో కొత్త బైక్ !



బైకులంటే యువతలో ఎంత క్రేజ్ ఉంటుందో అందరికీ తెలిసిందే. ప్రముఖ ద్విచక్రవాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ ఇప్పుడు కేవలం సాధారణ బైకులకు మాత్రమే పరిమితం కాకుండా యువతను ఆకర్షించే ప్రీమియం మార్కెట్ పై దృష్టి సారించింది. 160 సీసీ సెగ్మెంట్‌లో అపాచీ, పల్సర్ వంటి ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చేందుకు హీరో తన పాపులర్ మోడల్ ఎక్స్‌ట్రీమ్ 160 ఆర్ లో సరికొత్త వేరియంట్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. అత్యుత్తమ స్పోర్ట్స్ నేకెడ్ బైక్ అయిన హీరో ఎక్స్‌ట్రీమ్ 160 ఆర్ కు అడ్వాన్స్‌డ్ ఫీచర్లను జోడించింది. క్రూయిజ్ కంట్రోల్, రైడ్–బై–వైర్ థ్రాటిల్ వంటి అడ్వాన్స్‌డ్ ఫీచర్లతో వచ్చిన ఈ హీరో ఎక్స్‌ట్రీమ్ 160 ఆర్ 4 వీ వేరియంట్ ఎక్స్–షోరూమ్ ధరను రూ. 1,34, 100గా నిర్ణయించింది. ఇది స్టాండర్డ్ మోడల్ కంటే దాదాపు రూ. 4,500 అధికం. కానీ ఈ అద్భుత ఫీచర్లు 160 సీసీ సెగ్మెంట్ లో ఇంతవరకు ఏ బైకులోనూ లేకపోవడం గమనార్హం. 160 సీసీ సెగ్మెంట్ లో రైడింగ్ మోడ్స్ ను అందిస్తున్న తొలి బైక్ ఇదే కావడం ఈ కొత్త వేరియంట్ ప్రత్యేకత. బైక్ రైడర్లు తమకు అనుకూలంగా రెయిన్, రోడ్, స్పోర్ట్స్ అనే మూడు మోడ్స్‌ను ఎంచుకోవచ్చు. హ్యాండిల్‌బార్స్ పై కొత్తగా అమర్చిన స్విచ్‌ల ద్వారా ఈ మోడ్స్‌ను, క్రూయిజ్ కంట్రోల్‌ను సులభంగా ఆపరేట్ చేయవచ్చు. అయితే ఇందులో కూడా పాత మోడల్ లో ఉన్న 163.2సీసీ సింగిల్–సిలిండర్, ఎయిర్/ఆయిల్–కూల్డ్ ఇంజన్‌నే ఇందులోనూ కొనసాగించారు. ఈ బైక్ 8,500 ఆర్ ఏంపి వద్ద 16.9 హెచ్ పి శక్తిని, 6,500 ఆర్ ఏంపి వద్ద 14.6 ఎన్‌ఏం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. డిజైన్‌లో కూడా పలు మార్పులు చేశారు. ఎక్స్‌ట్రీమ్ 250 ఆర్ నుంచి స్ఫూర్తి పొందిన కొత్త ఎల్‌ఈడీ హెడ్‌లైట్, 4.2–అంగుళాల కలర్డ్ ఎల్‌సీడీ ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్, తాజా గ్రాఫిక్స్, నాలుగు కొత్త రంగుల ఆప్షన్స్‌తో ఈ బైక్ స్పోర్టీ లుక్‌ను సొంతం చేసుకుంది. హార్డ్‌వేర్ విషయానికి వస్తే మెరుగైన సస్పెన్షన్ కోసం ముందు వైపు కేవైబి యుఎస్డి (అప్‌సైడ్ డౌన్) ఫోర్క్‌లను, వెనుకవైపు మోనోషాక్ యూనిట్‌ను ఇచ్చారు. బ్రేకింగ్ భద్రత కోసం డ్యూయల్–ఛానల్ ఏబీఎస్ (యాంటీ–లాక్ బ్రేకింగ్ సిస్టమ్) సపోర్ట్‌తో డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి, ఇది రైడర్‌కు గరిష్ట భద్రతను అందిస్తుంది. ఈ కొత్త హీరో ఎక్స్‌ట్రీమ్ 160 ఆర్ 4వీ రెండు వేరియంట్‌లలో లభిస్తుంది. దీని స్టాండర్డ్ వేరియంట్ ధర రూ. 1,29,500 కాగా.. అన్ని ఫీచర్లు ఉన్న కాంబ్యాట్ ఎడిషన్ ధర రూ. 1,34,000 (ఎక్స్–షోరూమ్). ఈ బైక్ లోని అతిపెద్ద ప్రత్యేకత దాని రైడ్–బై–వైర్ థ్రోటల్ సిస్టమ్. అంటే, ఇందులో సాధారణ యాక్సిలరేటర్ కేబుల్ ఉండదు. బదులుగా, బైక్ వేగాన్ని, ప్రతిస్పందనను సెన్సార్ల ద్వారా ఎలక్ట్రానిక్‌గా నియంత్రించడం జరుగుతుంది. దీనికి తోడు సుదూర ప్రయాణాలకు అత్యంత సౌకర్యాన్ని ఇచ్చే క్రూయిజ్ కంట్రోల్ ఫీచర్‌ను కూడా అందించారు. సాధారణంగా దైనందిన ప్రయాణాలకు క్రూయిజ్ కంట్రోల్ ఫీచర్ అంతగా ఉపయోగపడకపోయినా, ఈ ఫీచర్‌ను అందించడం బైక్‌కు బలమైన ప్రీమియం ఇమేజ్‌ను ఇస్తుంది. ఇంత అడ్వాన్స్‌డ్ ఫీచర్లను ఇంత తక్కువ ధరలో అందించడం ద్వారా, హీరో 160 సిసి నేకెడ్ మోటార్ సైకిల్ మార్కెట్‌లో టీవీఎస్, బజాజ్‌లకు గట్టి పోటీ ఇవ్వడానికి సిద్ధమవుతోంది. కాంబ్యాట్ ఎడిషన్‌లో బ్రోన్జ్/బ్లాక్, ఫారెస్ట్ గ్రీన్/నియాన్ గ్రీన్, రెడ్ యాక్సెంట్‌తో కూడిన బ్లాక్, మ్యాట్ గ్రే షేడ్ వంటి నాలుగు ఆకర్షణీయమైన రంగుల ఎంపికలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ బైక్ మార్కెట్లో తుఫాన్ సృష్టించడం ఖాయమని అనిపిస్తోంది.

# టాటా సియెర్రా వస్ హ్యుందాయ్ క్రెటా ఏ ఎస్‌యూవీ బెస్ట్




టాటా మోటార్స్ తమ కొత్త సియెర్రా ఎస్‌యూవీని మార్కెట్లోకి విడుదల చేసింది. మిడ్–సైజ్ ఎస్‌యూవీ విభాగంలో అత్యధికంగా అమ్ముడవుతున్న హ్యుందాయ్ క్రెటాతో ఈ కొత్త కారు ప్రధానంగా పోటీ పడనుంది. టాటా సియెర్రా రాక తో క్రెటా కు సరైన పోటీ వస్తోందని ఉత్సుకత ప్రజల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ రెండు ఎస్‌యూవీల ప్రారంభ ధరలు, కొలతలు, ఫీచర్లు ఎలా ఉన్నాయో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. ధరల పోలిక: మొదటగా ఈ రెండు ఎస్‌యూవీల ధరలను గమనిస్తే టాటా సియెర్రా ప్రారంభ ఎక్స్–షోరూమ్ ధర రూ. 11.49 లక్షలుగా ఉంది. అయితే ఇది ముందస్తుగా పరిచయ ధర మాత్రమే. రాబోయే రోజుల్లో దీని ధర పెరిగే అవకాశం ఉంది. మరోవైపు హ్యుందాయ్ క్రెటా ప్రస్తుత ఎక్స్–షోరూమ్ ధర రూ. 10.73 లక్షల నుంచి ప్రారంభమై రూ. 20.20 లక్షల వరకు ఉంది. సియెర్రా బేస్ మోడల్ ధర క్రెటా బేస్ మోడల్ కంటే కొంచెం ఎక్కువగా ఉన్నప్పటికీ సియెర్రా కొలతలు, ఫీచర్ల పరంగా క్రెటా కంటే మెరుగ్గా కనిపిస్తోంది. సియెర్రాదే పై చేయి: డైమెన్షన్స్ పరంగా టాటా సియెర్రా స్పష్టంగా క్రెటా కంటే పెద్దది. కొత్తగా విడుదలైన సియెర్రా పొడవు 4,340 మి.మీ, వెడల్పు 1,841 మి.మీ, ఎత్తు 1,715 మి.మీగా ఉంది. దీని వీల్‌బేస్ 2,730 మి.మీ కాగా, గ్రౌండ్ క్లియరెన్స్ 205 మి.మీ ఉంది. సియెర్రా 622 లీటర్ల భారీ బూట్ స్పేస్‌ను కలిగి ఉంది. దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న క్రెటా కొలతలను చూస్తే దాని పొడవు 4,330 మి.మీ, వెడల్పు 1,790 మి.మీ, ఎత్తు 1,635 మి.మీగా ఉన్నాయి. క్రెటా వీల్‌బేస్ 2,610 మి.మీ, గ్రౌండ్ క్లియరెన్స్ 190 మి.మీ, బూట్ స్పేస్ 433 లీటర్లు. అంటే కొలతల పరంగా సియెర్రా ప్రతి అంశంలోనూ క్రెటా కంటే పెద్దదిగా ఉండి ఎక్కువ క్యాబిన్ స్థలాన్ని అందిస్తోంది.

ఫీచర్లు: సియెర్రాలో ట్రిపుల్ స్క్రీన్స్: టాటా మోటార్స్ తమ సరికొత్త సియెర్రాను ఫీచర్–ప్యాక్డ్ ఎస్‌యూవీని ప్రవేశపెట్టింది. ఈ సెగ్మెంట్‌లోని ఇతర కార్లలో లేని అనేక ప్రత్యేకతలు సియెర్రాలో ఉన్నాయి. ఇందులో ఏకంగా మూడు స్క్రీన్లు ఉన్నాయి – అవి ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో పాటు ప్యాసింజర్ ఎంటర్ టైన్ మెంట్ కోసం కూడా ఒక స్క్రీన్ ఉంది. అదనంగా ప్రీమియం ఇంటీరియర్, సాఫ్ట్ టచ్ మెటీరియల్స్, పనోరమిక్ సన్‌రూఫ్, డ్యూయల్ జోన్ క్లైమేట్ కంట్రోల్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, అండర్ థై సపోర్ట్, డాల్బీ అట్మోస్‌తో కూడిన ప్రీమియం సౌండ్ సిస్టమ్, వైర్‌లెస్ ఛార్జర్ వంటి అనేక సౌకర్యవంతమైన ఫీచర్లు సియెర్రాలో ఉన్నాయి.

క్రెటా కూడా తక్కువేం కాదు: హ్యుందాయ్ క్రెటా కూడా ఫీచర్ల విషయంలో చాలా శక్తివంతమైనది. దీని బలమైన డిజైన్, స్ప్లిట్ హెడ్‌లైట్ డిజైన్, పెద్ద క్యాస్కేడింగ్ గ్రిల్ ఆకర్షణీయమైన రూపాన్ని ఇస్తాయి. క్రెటాలో పనోరమిక్
సన్‌రూఫ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 10.25 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, బోస్ ప్రీమియం సౌండ్ సిస్టమ్, బ్లూలింక్ కనెక్టెడ్ కార్ టెక్నాలజీ వంటివి ఉన్నాయి. భద్రత (సేఫ్టీ) పరంగా.. క్రెటాలో 6 ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్ కంట్రోల్‌తో పాటు అనేక ముఖ్యమైన అడాస్ ఫీచర్లు లభిస్తాయి. కొలతలు, క్యాబిన్ స్థలం, ప్రత్యేకమైన ఎంటర్‌టైన్‌మెంట్ ఫీచర్ల పరంగా టాటా సియెర్రా మెరుగైనదిగా నిలుస్తోంది. అయితే హ్యుందాయ్ క్రెటా నిరూపితమైన మార్కెట్ ట్రాక్ రికార్డ్, ఆకర్షణీయమైన డిజైన్, అడాస్ వంటి ముఖ్యమైన భద్రతా ఫీచర్ల కారణంగా బలమైన పోటీని ఇస్తుంది.

# ‘ఐటమ్ భామ’ అంటూ తక్కువగా చూసారు!- మలైకా





చీరలో మాల్వీ మల్హోత్రా స్టన్స్

బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ మలైకా అరోరా వ్యక్తిగత, వృత్తిగత జీవితం ఎప్పుడూ హెడ్ లైన్స్ లో నిలుస్తుంది. యువహీరో అర్జున్ కపూర్ తో ఎఫైర్ కారణంగా నిరంతరం మీడియా హెడ్ లైన్స్ లోకి వచ్చిన మలైకా అతడితో బ్రేకప్ అయ్యాక, ఇటీవల స్తబ్ధుగా ఉంది. కొంతకాలంగా తన కెరీర్ పైనే ఫోకస్ చేస్తోంది.అయితే మలైకా అరోరా భవిష్యత్ లో సినిమాల నిర్మాణం, దర్శకత్వం వైపు అడుగులు వేసే ఆలోచనలో ఉందా? అంటే దానికి అవకాశం లేకపోలేదని సమాధానం ఇచ్చింది. తనకు కెమెరా వెనక సాంకేతిక అంశాలపైనా ఆసక్తి ఉందని మలైకా తాజా ఇంటర్వ్యూలో వెల్లడించింది. తెరవెనక చాలా అంశాలు ఆసక్తిని కలిగిస్తాయని, ఏదో ఒకరోజు ఆ పని చేస్తానని పేర్కొంది.

నటిగా పెద్ద స్థాయిని ఎందుకు కోరుకోరు? అని ప్రశ్నిస్తే... మొదటి నుంచి తాను నర్తకిగా కొనసాగానని, స్పెషల్ నంబర్లు చేయడం తన ప్రధాన బలం, ఆసక్తి అని చెప్పింది. నాకు ఎందులో బలం ఉందో అదే దారిలో వెళ్లానని చెప్పారు. ఒకానొక దశలో ఐటమ్ పాటను తక్కువగా చూసారు. ఐటమ్ నర్తకిని చిన్నగా చూసారు. కానీ కాలక్రమంలో అది మారింది. ఐటమ్ పాటలో నర్తించడం అంటే అందాలు ఆరబోయడం ఒక్కటే కాదు.. హావభావాల వ్యక్తీకరణ, క్రియేటివిటీ పరంగా సవాల్‌ని ఎదుర్కోవడం అని నెమ్మదిగా గ్రహించారని కూడా మలైకా అన్నారు. కథనాన్ని నడిపించే దమ్ము ఐటమ్ పాటలోను ఉంటుందని మలైకా అన్నారు. ఐటమ్ నంబర్ల మేకింగ్ పై ఇప్పుడు మంచి గౌరవం ఉందని అన్నారు.
ఈమధ్యనే 50కి ఒక సంవత్సరం అదనంగా పెరిగింది. ఎప్పటికీ ఇదే ఉత్సాహం ఉంది నాలో. నాపై అభిమానం, ప్రేమ చూపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇన్నేళ్లుగా నన్ను ఆదరించిన వారందరికీ ప్రత్యేకించి కృతజ్ఞతలు అని అన్నారు. తన వ్యక్తిగత జీవితం గురించి ఎదురయ్యే ట్రోలింగ్ పైనా మలైకా మనసు విప్పి మాట్లాడారు. నిజానికి మనల్ని అనేవాళ్లు ఎప్పుడూ ఉంటారు. కానీ నేను నాపై దృష్టి పెట్టడం నేర్చుకున్నాను. ప్రతికూలత నన్ను డిసైడ్ చేయనివ్వను. ట్రోల్స్ ఉంటాయి. కానీ నేను ఆ విషాన్ని స్వీకరించను. నా కుటుంబం, స్నేహితులు నాకు చాలా ముఖ్యం.. మనశ్శాంతి ఇంకా ఎక్కువ ముఖ్యం! అని అన్నారు. మలైకా ప్రస్తుతం డ్యాన్స్ రియాలిటీ షోల జడ్జిగా ఆర్జిస్తున్నారు. ఇండస్ట్రీలో టాప్ మోడల్ గా కొన్ని బ్రాండ్లతో కాంట్రాక్టుల ద్వారా కూడా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.



ప్రిషా రాజేష్ సింగ్ మోడ్రన్ డ్రెస్‌లో స్టన్స్, ఫ్యాషన్ ఫేవరెట్‌గా హృదయాలను గెలుచుకోవడం కొనసాగించింది

# సమంత.. ఫేవరెట్ టైమ్ ఏంటో తెలుసా?

స్టార్ హీరోయిన్ సమంత సోషల్ మీడియాలో ఫుల్ గా యాక్టివ్ గా ఉంటారన్న విషయం తెలిసిందే. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ ను షేర్ చేస్తుంటారు. తన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన అప్డేట్స్ కూడా ఇస్తుంటారు. అవి ఎప్పుడూ వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా ఇన్ స్టాగ్రామ్ స్టోరీస్.. నెట్టింట స్పెషల్ గా ఉండి ఆకట్టుకుంటాయి. తాజాగా తన ఇయర్ లో ఫేవరెట్ టీమ్ ఏంటో చెబుతూ పోస్ట్ చేశారు సమంత. అంతకుముందు ముంబైలోని తన ఇంటి మెయిన్ డోర్ పిక్ ను షేర్ చేశారు. డోర్ చుట్టూ స్పెషల్ డెకరేషన్ చేసి ఉంది. మరోనెల రోజుల్లో క్రిస్మస్ పండుగ రానుండగా.. ఇప్పుడే సామ్ ఆ ఫెస్టివల్ మోడ్ లోకి వెళ్లిపోయారు. తన ఇంటిని డెకరేట్ చేసుకున్నారు. ఇంటి మెయిన్ డోర్ కు ఓవైపు క్రిస్మస్ ట్రీ పార్ట్ ను అటాచ్ చేయగా.. మరోవైపు స్టైలిష్ “%బాావీ%”లోగో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ఈ సంవత్సరం ఇలా అన్నట్లు క్యాప్షన్ ఇవ్వగా.. మరో పిక్ లో ఇంట్లో క్రిస్మస్ థీమ్ డెకరేషన్ చేసుకున్న పిక్ పోస్ట్ చేశారు. ఆ ఫోటోకు అదే తన ఫేవరెట్ టైమ్ అంటూ రాసుకొచ్చారు సమంత.
ప్రస్తుతం సమంత ఇన్ స్టా స్టోరీస్ కు సంబంధించిన స్క్రీన్ షాట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అవి అందరినీ ఆకట్టుకుంటున్నాయి. దీంతో డెకరేషన్ అదిరిపోయిందని సామ్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అడ్వాన్స్ హ్యాపీ క్రిస్మస్ అంటూ విషెస్ చెబుతున్నారు. ఫుల్ గా సెలబ్రేట్ చేసుకోండని అంటున్నారు. అయితే సమంత.. పర్సనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలతో కొంతకాలంగా వార్తల్లో నిలుస్తున్నారు. గత కొంత కాలంగా బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో ఆమె సన్నిహితంగా ఉన్నారని, వారిద్దరూ డేటింగ్ లో ఉంటున్నారని సోషల్ మీడియాలో రూమర్లు వినిపిస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు ఎక్కడా సమంత రెస్పాండ్ అవ్వలేదు. కానీ రాజ్ నిడిమోరుతో కలిసి పార్టీలకు, సినిమా ఈవెంట్స్ కు సామ్ వెళ్లడంతో రిలేషన్ షిప్ రూమర్లకు మరింత బలం చేకూరుతుంది. వారిద్దరూ ఎక్కడ కనిపించినా అక్కడికి సంబంధించిన వీడియోలు, దిగిన ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. రీసెంట్ గా దీపావళి పండుగ ఇద్దరూ కలిసి జరుపుకున్నారు. మరి రిలేషన్ షిప్ రూమర్స్ లో నిజమెంతో వారికే తెలియాలి.

